

ఆషాఢ పూర్ణిమన ఆచార్యుని సేవనం గురుపూర్ణిమ - గురుని సేవనం
శ్రమను మరచి, ప్రమను పరచి
స్ఫూర్తి కలిగించి, దీప్తిని రగిలించి
తాపాలు హరించి, దీపాలు వెలిగించి
మనసును ఊరించి, మహిమను ఊరేగించిన
దేవాధిదేవుడు... సద్గురు దేవుని చరణాల చెంత
శిరము వంచి కరములుంచి
సద్గురుని తన హృదిలో నిలవమన్న వేడుకోలే
వేడుకగా... ఉల్లాస, ఉత్సాహ ఉత్సవమే పండుగ. అదే బాబా చెప్పిన ఒకే ఒక పండుగ.
కృతజ్ఞతా మహోత్సవం.... గురుపూర్ణిమ.... ఆషాఢ పూర్ణిమ..

- గురుకృప

శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!






ఏదైతే నీలో ప్రేమను ప్రజ్వలింప చేస్తుందో, ఏదైతే నిన్నొక వ్యక్తిగా మలచి, నీ ఆశయసిద్ధిని తెలియని రీతిలో అనుభవింప చేస్తుందో, ఏదైతే ఆనందం, ప్రశాంతి, నమ్మకము, రక్షణ మొదలైన భావాలను కలుగచేస్తుందో అదే సద్గురువు... అసలు ఏం జరుగుతున్నదో నీకు తెలియదు. జరుగుతున్న దానికి ఆధారంకాని, ప్రమాణం కాని ఉండదు. కానీ అది నీ అనుభవంలోనికి వస్తుంది. దానినే సద్గురువు అంటాను. - శ్రీబాబూజీ





# గురుకృప

గురుపూర్ణిమ సంచిక

**కృతజ్ఞతా మహోత్సవం**



శ్రీ గురుభ్యోనమః

అతి సుందరమైన రూపం
అవ్యాజమైన ప్రేమ
అక్కున చేర్చుకునే కరుణ
అతి మధురమైన నామధేయం
సమ్మోహనమైన వీక్షణం
సముద్రమంత గాంభీర్యం
కరుణ కురిపించే ప్రేమతత్వం
చిరుజల్లులాంటి చిరునవ్వు
భయం పోగొట్టే అభయం
చల్లని దీవెనల వరదహస్తం
చింతలు తీర్చే చరణకమలం
పరవశింపచేసే పలకరింపు
ఓర్పునిచ్చే ఓదార్పు
మూర్తీభవించిన అనుగ్రహం
మరల్చుకోలేని మూర్తిమత్వం
బాధ్యత తీసుకునే బంధం
అనుభూతులనొసగే అనుబంధం
బోధించని ప్రబోధం
నేర్చుకొమ్మనే నిరాడంబరత్వం
సవ్యంగా సాగేందుకు సమయపాలనం
కంచెలాంటి సత్సంగం
పరిణితినిచ్చే పారాయణ
కాపాడే సాయినామం

ఆధ్యాత్మిక సాధనా సౌధానికి మూలస్థంభం సద్గురువు.



## ప్రేమ ఉంటే చాలు :

**శిష్యుడు :** మీకు దగ్గర కావాలంటే మీరు చెప్పినట్లు నడుచుకోవాలి. అలా మీమీద ప్రేమ పెరగాలి. మీరు చెప్పినవి శ్రద్ధగా చెయ్యాలంటే దానికి ఎలా ఉండాలి?

**గురువుగారు :** ప్రేమ ఉంటే ఆటోమేటిక్‌గా చేస్తావయ్యా. దానికేం రూల్సు పనిలేదు. నియమాలు పనిలేదు. దానికేం పెద్ద విశేషాలు తెలుసుకోవలసిన అవసరం లేదు. ఏం లేదు ప్రేమ ఉంటే చేస్తావు. ఇటువంటి సత్సంగాలు కూడా అవసరం లేదు. అది (ప్రేమ) గానీ ఉంటే.

**శిష్యుడు :** అది ఇంప్రూవ్ చేసుకోవడం.

**గురువుగారు :** అదే అవుతుంది. చేస్తూ ఉంటే అవుతుంది. చేస్తూ ఉంటే, ఆ పని అలా చేస్తూ ఉంటే మనకు ఎటువంటి ఫలితాలు వస్తాయో తెలుస్తూ ఉంటాయి. తెలిసే కొద్దీ ఇంకా, ఇంకా విజృంభిస్తూంటాం. అది లేదనుకో (ప్రేమ), ఊరకనే రూల్సు ప్రకారంగా చేసినట్లవుతుంది. మీరు చెప్పారు కానీ, నేను చేయలేకపోయాను అనాల్సి వస్తుంటుంది. చేయలేకపోవడం ఎందుకు జరుగుతుందంటే, ప్రేమ అంత బలంగా లేకపోవడం. ఆ చేసేటప్పుడు దేని గురించి చేస్తున్నామో దానిమీద ఎక్కువ ప్రేమ ఉండటం. ఈ రెండే కారణాలు. మీమీద నాకు అపారమైన ప్రేమ ఉంది. మీమీద కంటే నాకు ఇంక దేనిమీదా ప్రేమ లేదు. అయినా చెయ్యలేకపోతున్నాను అంటే మాత్రం అది అబద్ధం.

**శిష్యుడు :** ప్రేమ ఎంత ఎక్కువుంటే అంత గ్రేస్, బ్లెసింగ్స్ ఎక్స్‌పీరియన్స్ చేయగలుగుతామా?

**గురువుగారు :** ఏం లేదు, ప్రేమ తక్కువున్నా, దానికీ, దీనికీ ఏం సంబంధం లేదు. ప్రేమ ఎక్కువుంటే నీవు అనుభవిస్తావు. ఎక్కువ గ్రేస్ క్వాంటిటీలో తేడా రాదు. ప్రేమ ఉన్నా లేకపోయినా నీ మీద ఉండే గ్రేస్ అట్లాగే ఉంటుంది. కాదని నీవు ఉపయోగపెట్టుకోవు. ప్రేమ ఉంటే ఉపయోగపెట్టుకుంటాడు. అంతే, ఎక్స్‌పీరియన్స్ చేస్తాడు.

**శిష్యుడు :** చెయ్యాలంటే ప్రేమ ఉండాలి అన్నారు కదండీ, అది ఉండాలంటే,

**గురువుగారు :** దానికేం లేదు. దానికై దానికి కలగాలంతే. కొంతమందికి కలిగి వేరే వేరే ద్వారా పోతుంది. అనుకున్నప్పుడు సత్సంగాల్లాంటివి. ఎక్కువగా కాంటాక్ట్‌లో ఉండటం లాంటివి దోహదం చేస్తాయి అంతే. ప్రేమను పుట్టించవు అవి. ఒక కంచెలాగా ఉపయోగపడతాయి అంతే. అవన్నీ కూడాను మనకు ఉండేటువంటి ప్రేమకు వ్యక్తీకరణ రూపాలే, అంతే, అవి దేనిని పుట్టించవు. పనేం చేయవు.

– శ్రీబాబూజీ సత్సంగ సుమాలు



మన ప్రవర్తననుంచి వాళ్లు నేర్చుకోవలసినదేదైనా ఉండి తీరాలి. అధికారం పోయినవాడు ఎలా ఆజ్ఞాపించలేడో, అర్హత కోల్పోయినవాడు అలాగే చెప్పి వినపించలేడు. మన ప్రవర్తనలో తీరుతెన్నులు వున్ననాడు మనం చెప్పవలసిన అవసరం లేకుండానే మనను చూచి మన పిల్లలు పెరగవలసిన తీరులో పెరుగుతారు. **ఏం బోధపడిందా? మన పిల్లలు కనుక చెడిపోయారని ఎందుకు అన్నానో!**

**పిల్లలకి పద్ధతి వచ్చేదెలా ?**

**శిష్యుడు :** ఏమిటో మాస్టారూ ! ఎన్ని అమర్చి పెట్టినా ఈ పిల్లలు ఒక పద్ధతిలోకి రావడంలేదు. వాళ్ళల్లో వాళ్ళకి కలవడం లేదు. ఏం చేస్తే వీళ్ళు ఒక దారికి వస్తారో బోధపడటం లేదు.

**మాస్టర్ ఇ.కె.:** ఏమిటేమిటి అమర్చిపెట్టారు పిల్లలకి ?

**శిష్యుడు :** చదువుకోడానికి ఎవరి రూము వాళ్ళకి, ఒకే బళ్ళో చదువుతున్నా ఎవరి క్యారేజి వారికి ఏర్పాటు చేసాను. ఇలాగ పోట్లాటలు రాకుండా ఉండాలని ఎవరివి వారికి ఎన్ని ఏర్పాట్లు చేసినా ఒకళ్లతో ఒకళ్ళు కలిసి ఉండలేకపోతున్నారు.

**మాస్టర్ ఇ.కె.:** మీరు పిల్లలకు చేసింది ఏర్పాటు అనుకుంటున్నారేమో **అది ఏర్పాటు కాదు, వేర్పాటు.** వారు చెడిపోవడానికి ఎన్ని కావాలో అన్నీ చేసి చెడిపోయారని ఏడుస్తారేం? ఎవడి రూములో వాడు వుంటూ, ఎవడి లైటు దగ్గర వాడు చదువుకొంటూ, ఎవడి క్యారేజిలో వాడు భోంచేస్తూంటే, ఇక వాళ్లెందుకు కలిసి ఉంటారు? మీరు చేసిన ఏర్పాట్లతో వాళ్లు ఎవరికి వాళ్లుగా బ్రతుకుతున్నారు, ఒకళ్లకి ఒకళ్లుగా బ్రతకవలసిన అవసరం వాళ్లకేమిటి ?

**శిష్యుడు :** అయితే ఇప్పుడు ఏం చేయాలంటారు ?

**మాస్టర్ ఇ.కె.:** నీళ్లు పోయిన తర్వాత గట్టు వేసినట్లు మీకు పనికిరాకపోయినా మిగిలిన వాళ్లకైనా పనికివస్తుందేమో చెబుతాను విను. చిన్నప్పటి నుండి పిల్లలు కలిసి బ్రతికేటట్లుగా వారి దినచర్య అమర్చాలి. కలిసిగట్టుతనం మనం నూరిపోస్తే వచ్చేది కాదు. వాళ్ల దినచర్యలోనే వాళ్లకు అలవడేటట్లుగా చూడాలి. ఒక తొట్టిలో నీళ్ళు అందరూ పోసుకునేటట్లు చూడటం, ఒకేచోట అందరూ కలిసి భోంచేసేట్లు చూడటం, ఒకే హాలులో అందరూ ప్రక్క ప్రక్కన పడుకొనేటట్లు చూడటం, ఒకే క్యారేజిలో నలుగురూ నాల్గుముద్దలు తినేట్లు చూడటం, మొదలైన పద్ధతులు ఆచరణలో పెడితే కలిసి బ్రతకటంలోని రుచి ఆ పిల్లలకి తెలుస్తుంది. ఆ రుచి తెలిసిన తర్వాత చిన్న చిన్న విభేదాలు అవీ వస్తూ పోతూ వున్నా, వాళ్ళంతా జీవితాంతం కలిసి ఉండాలనే కోరుకుంటారు. ఎలాగ నడిపితే పిల్లలకి కలిసిమెలసి ఉండాలని ముచ్చట కలుగుతుందో, అలాగ నడపటం చేతనైన నాడు తల్లిదండ్రుల పాత్రను మనం సరిగా నిర్వహించగలిగామన్నమాట.

సేకరణ : *డా॥ మోపిదేవి కృష్ణస్వామి (మాస్టర్ ఇ.కె.గారితో సంభాషణలు–సమన్వయాలు)*




సంపుటి : 20
సంచిక : 3






జూలై 9
2017





# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ

లోపలి పేజీలలో


4 పథగామి – గురుకృప
6 గురుపూర్ణిమ – గురుకృప
9 వినిపించెను ఆరతి గీతం .. –సాయిశ్రీనివాస్
13 దయామృత ధార – డాక్టర్ పులిచెర్ల సాంబశివరావు
15 యధోక్తకారి – శరశ్చంద్రికలు
17 పరనింద హత్య .. – మురళీయం
19 గురుకృపాలహరి – గురుకృప
25 గురుదేవుల సత్సంగం గురించి... – ఫణి


నిర్వహణ : *గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు*

GURUKRUPA

Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



## పథగామి

సర్వవ్యాపకము, సర్వసమర్థము అయిన సద్గురు స్వరూపము ఆపద్బాంధవతత్త్వమై అనుక్షణము మనలను ఆదుకుంటూనే ఉంది. సదా ఆనందాబ్ధిలో నిలుపుతూనే ఉంది. దైన్యం ఉన్నచోట దైవానికి మానవ రూపంగా సద్గురుతత్త్వం అలరారుతోంది. దివ్యత్వాన్ని తెలుసుకోవాలన్న ఆసక్తి జ్వలించిన చోట చేయిపట్టి నడిపించే సారథిగా సద్గురుతత్త్వం వెలుగుతోంది. 'నా' అన్న అహంలో మునిగి లెక్కలేనన్ని నాన్వేషూట్‌లను నిర్మించుకుంటున్న మనిషికి తన మాతృత్వపు మాధుర్యాన్ని చవిచూపి, "మనిషి దైవంగా ఎదగడం బాబా మతం" అంటూ సాయిమార్గాన్ని సార్వజనీనం చేసారు శ్రీబాబూజీ. సంక్లిష్టమైపోతున్న సాయుజ్యాన్ని (దైవత్వాన్ని) సరళము చేసిన విశిష్టత్వము సద్గురుపథం. అందనంత ఎత్తున తను కూర్చుండి – "పైకి చేరగలవు! ప్రయత్నం చెయ్యి" అంటూ మాటలు చెప్పక, తాను మనకై దిగి వచ్చి, మానవరూపంలో మనతో చేరి, మనిషికి సేవచేసి, మనసుకు త్రోవ చూపిన మహోన్నతతత్త్వం – సద్గురువు.

సద్గురు స్వరూపం మనిషికి మార్గం చూపిన వైనం – ఆచరణాత్మక జీవన విధానం. అందుకే అంటారు శ్రీబాబూజీ – "నిజానికి శ్రీసాయిబాబా వంటి మహాత్ముల ఆచరణ – బోధనలే శాస్త్రాలకు ఆధారము, ప్రమాణము కూడా!" అని. శ్రీసాయిబాబా అన్నారు "ఊరకనే గ్రంథములు చదువుట వలన ప్రయోజనము లేదు. నీవు చదివిన విషయాన్ని గూర్చి విచారించి, అర్థం చేసుకొని ఆచరణలో పెట్టాలి. లేనిచో ప్రయోజనం లేదు. గురువానుగ్రహము లేని ఉత్త పుస్తక జ్ఞానము నిష్ప్రయోజనము" అని. ఆచరణలో ఉన్న ఆంతర్యాన్ని మనలో నిలిపేందుకు గురుదేవులంటారు "నిజంగా మీరు ఒకవేళ బాబా గురించే ఆలోచిస్తుంటే అది మీ స్వభావంలో, మీరు చేసే పనులలో వ్యక్తం కావాలి". ఆచరణాత్మక జీవనం మనలో నిలిచిపోవాలనే తపనతో ఇంకా వారంటారు "నిజంగా మనం ఏమిటి అనే విషయాన్ని తెలియచేసేది మనం చేసే పనులే. అంతేగానీ, మనం మాట్లాడే మాటలో, చేసే ఆలోచనలో కావు. మన చేతలే నిజమైన కొలబద్ద." నిజానికి సద్గురుచంద్రులు బోధలకు పరిమితం కాలేదు. వారి బోధ అంటే వారి ఆచరణేనన్నది సత్యం. మహాత్ముల బోధలను అనుసరించడం ఒక ఎత్తు. వాటిని అంగీకరించి, అవగాహన చేసుకొనుట వలన మాత్రమే సాధకులకు ఉన్నతి కలుగును.

వారి హితాచరణాను అవగాహన పరచుకొని, అన్వయ సమన్వయాలతో, అనుభూతి పొందినచో,





## యువతరం దారి తప్పడానికి కారకు లెవరు ?

**ప్రశ్న :** మాస్టరు గారూ ! ఏమిటో ఈ మధ్య యువతరం మరీ వెఱ్ఱితలలు వేస్తోంది. ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తారో ఆ కుర్రవాళ్ళకే తెలియకుండా వుంది. కాబోయే పౌరులు కదా వీళ్లు ! దేశ భవిష్యత్తు వీళ్ళ మీద ఆధారపడి వుంది కదా! వీళ్ళిలా పద్ధతి లేకుండా విచ్చలవిడిగా విధ్వంసకరంగా ప్రవర్తించడం చూస్తుంటే ఏమైపోతారా వీళ్ళు అనిపిస్తుంది. అసలు వీళ్ళు ఇలా ఎందుకు చెడిపోయారంటారు?


**మాస్టర్ ఇ.కె.:** మన పిల్లలు కనక చెడిపోయారు. చెట్టును బట్టికదా కాయలు ఉండేది? మనను బట్టి మన పిల్లలు ఉంటారు. యువతరం అని వాళ్ళకు వేరే నామకరణం చేస్తావెందుకు? తప్పించుకోవటానికి. అక్కడ వున్నది నీ పిల్లలు, నా పిల్లలు, మనలాంటివాళ్ళ పిల్లలు. వాళ్ళను అలా తయారుచేసింది మనమూ, మన ప్రవర్తన. మనం వాళ్ళపట్ల ఎలా ఉండాలో అలా ఉండటం లేదు కనుక వాళ్లు. వాళ్ళకెలాతోస్తే అలా ఉంటున్నారు. కోప్పడకు, ఒక చిన్నమాట అడుగుతాను. మన దగ్గరనుండి అంటే మనతరం నుండి పిల్లలు నేర్చుకోవలసినది ఏమి ఉందంటావు? కోర్టుల కెక్కడం నేర్చుకోవాలా? కులాల తగాదాలు నేర్చుకోవాలా ? త్రాగుడు, జూదం నేర్చుకోవాలా? ఏం నేర్చుకోవాలి? నేర్చుకోవలసింది లేక, నేర్చుకోవలసినదేమిటో తెలియక అలా వీధిన పడుతున్నారు ఆ కుఱ్ఱవాళ్ళు.

**ప్రశ్న :** ఈ తరం తల్లిదండ్రులకు నైతిక విలువలు తక్కువ. కాని పిల్లలు విషయంలో చేయవలసినదంతా చేస్తున్నారు. కదా?

**మాస్టర్ ఇ.కె.:** చేయవలసిందంతా చేస్తున్నామంటారా! ఏమిటి చేస్తున్నది? మాటలు కూడా రాకముందే కాన్వెంట్లలో పారేస్తున్నాం. డ్రస్ కుట్టించి, పుస్తకాలు చేతికిచ్చి, టిఫిన్‌బాక్స్ సర్ది, కాన్వెంట్ బస్సు ఎక్కిస్తే మన బాధ్యత అయిపోయిందనుకుంటున్నాం. చదువులకు ఫీజులు కట్టటం, కావలసినవి కొనిపెట్టటం, ఇవేనా తల్లిదండ్రులు నిర్వహించవలసిన బాధ్యతలు? వీటిపైన మరొకటి వున్నది. అది మన బిడ్డలను మనం తీర్చిదిద్దడం. దానికి మనకి ఖాళీ ఉండటం లేదు. మనం చాలా బిజీగా ఉంటున్నాం. ఈ బిజీ అంతా ఆ పిల్లల కొరకే అంటున్నాం. కాని వాళ్ళకి ఏం చేయాలో అది చేయలేకపోతున్నాం. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటున్నాం.

**ప్రశ్న :** పిల్లలు బాగుపడాలని కలగచేసుకొని ఇది మంచి, ఇది చెడు అని చెపుతూనే ఉంటారు. కాని ఎక్కడ ? వాళ్ళ తలకు ఎక్కందే ?

**మాస్టర్ ఇ.కె.:** పిల్లలు మనం చెప్పినట్లు చేయటం లేదంటావు. పిచ్చివాడా ! పిల్లలు ఎప్పుడూ మనం చెప్పినట్లు చేయరు. మనం చేసినట్లు చేస్తారు. చేతనైతే చేయడంలో జాగ్రత్త పడాలి. కోపంవచ్చి, కేకలేసి ధర్మపన్నాలు వల్లించినంత మాత్రాన తేలికౌతాం తప్ప, వారు బాగుపడరు. మనవల్ల వాళ్ళు బాగుపడాలంటే



స్వామిని బయటకు రమ్మని తన సేవకునితో కబురు పంపుతాడు. అప్పుడు స్వామి – తనకు పని వుంటే తననే రమ్మని సమాధానం పంపుతాడు. అది విన్న అలెగ్జాండర్‌కి కోపం వస్తుంది. తమాయించుకొని నీవు సరిగా చెప్పి వుండవు, వచ్చింది 'Great Alexender' అని చెప్పు అని మరలా పంపుతాడు. అదే సమాధానంతో తిరిగి వస్తాడు. కోపంతో స్వామి వద్దకు వెళ్లిన Alexanderను చూస్తూనే "నా సేవకుని సేవకుడా" "My servent's servent-Have your seat" అని అంటారు స్వామి అలెగ్జాండర్‌తో. కట్టలు తెంచుకున్న కోపంతో తన కత్తిని తీసి... స్వామీ! మీరు అలా ఎందుకన్నారు అని అడిగితే, "నీవు ఇలా చేస్తున్నా, నా కోపాన్ని నేను అదుపులో వుంచుకున్నాను కనుక అది (కోపం) నా సేవకుడు. నీవు నీ కోపాన్ని అదుపులో వుంచుకోలేవు కనుక నీవు నీ కోపానికి సేవకుడవు. అందుకే అన్నాను 'నా సేవకుని సేవకుడవు' అని. మీకు ఏం కావాలో కోరుకోండి అంటారు స్వామి అలెగ్జాండర్‌తో. నాకేమీ అవసరంలేదు అన్న సమాధానం. మీకు బట్టలు కూడా సరిగా లేవు అంటాడు. అయినా నీవు ఎందుకు ఇలా యుద్ధాలు చేస్తున్నావు అని అడిగితే, సామ్రాజ్యాధిపతినై ఆనందించడం కోసం అంటాడు అలెగ్జాండర్. ఆ ఆనందాన్ని నేను నిరంతరం పొందుతున్నాను. నీకు ఆనందంలేదు–అన్నాక కనువిప్పు కలిగింది. అలెగ్జాండర్‌కు. తన సైన్యం మలేరియాకు లోనవుతారు. యుద్ధాన్ని చాలించి తన స్వదేశానికి తిరుగు ప్రయాణం ప్రారంభిస్తాడు. మార్గమధ్యంలోనే అర్థం అవుతుంది, తన స్వదేశానికి వెళ్లలేను, మార్గమధ్యంలోనే మరణిస్తాను అని, తన మంత్రికి తన మూడు కోరికలు వ్యక్తం చేస్తాడు. ఒకటి తన శవపేటికను తనకు వైద్యం చేస్తున్న వైద్యులు మోయాలని (వీళ్లు, నా డబ్బు నాకు ప్రాణాలు ఇవ్వలేకపోయాయన్న సత్యం), రెండు... ఇన్ని రాజ్యాలు జయించినా అనుభవించింది లేదు – అని తెలియడానికి శవపేటిక యాత్రలో కాయిన్స్ చల్లండి. ఇక మూడవది తన చేతుల్ని శవపేటిక నుండి పైకి కనబడేట్టు వుంచండి. నేను ఎలా వచ్చానో ఈ భూమి మీదకు, అలానే వట్టి చేతులతో వెళుతున్నాను అన్న సత్యం అందరికీ తెలియాలన్న తన కోరికలు చెబుతాడు. ఓ మహాత్ముని దర్శనంతో ఇంత సత్యం తెలుసుకొని అందరికీ పంచాలన్న తపనే అతన్ని చివరికాలంలో అంత గొప్పవారిని చేసింది. ఎన్నో రాజ్యాలను జయించిన అలెగ్జాండర్ ఇండియాలో దోమలతో ఓడిపోయాడు. ఎన్నో గొప్ప, గొప్ప సేనలు చేయలేని పనిని ఇండియా దోమలు చేసాయి. ఈ జీవితం మొత్తం ధనం సంపాదించడానికి, సామ్రాజ్య విస్తరణకు నా బలాన్ని, బలగాన్ని, తెలివి తేటల్ని, సమయాన్ని ఉపయోగించాను. మరణం వచ్చినప్పుడు ఏ డాక్టర్ రక్షించలేదు. నేను సంపాదించినది నాకు ఉపయోగపడలేదు. నేను ఎలా వచ్చానో అలానే వెళుతున్నాను.

– సేకరణ : గురుకృప





అవి మన స్వభావములో ఇంకును. అట్లు మనలో సంస్కారాలుగా నిలిచి, నిర్మలత్వంగా మెరిసి, మనను పరిశుద్ధులుగా మలచును. మనము పరిశుద్ధులుగా నిలుచుటకే పవిత్రమూర్తుల బోధలన్నది మరువరాదు. "మరపే మరణం అన్నాడు ఓ మహాత్ముడు. దీన్ని తప్పించుకోవాలంటే సంపూర్ణ ఎరుక అవసరం" అంటారు శ్రీబాబూజీ. వేసే ప్రతీ అడుగును వారి పరంగా విశ్లేషించుకుంటే ఆచరణాత్మకమవుతుంది జీవితం. చివరకు ఆ'చరణా'లను చేరుతుంది మానసం.

లోకమున బోధలు ఆలకించువారెక్కువ – అనుసరించువారు తక్కువ. మన స్థితి అయితే ఇదిగో ఇలా! ఆకలి అవుతోంది. ఆహారం తింటే ఆకలి తీరుతుందన్న అవగాహన ఉంది. సద్గురువనే 'అమ్మ' – ప్రేమతో విందు భోజనం సిద్ధంగా ఉంచింది. ఇన్నీ ఉన్నా ఆకలి తీరుతుందా? ఆకలి – తింటేనే తీరుతుంది. తినడం ఆచరణ. ఎన్ని మాటలు చెప్పినా, ఎంత ప్రయాసపడ్డా తింటేనే ఆకలి తీరునట్లు, విన్నది ఆచరిస్తేనే సద్గురువైభవం బోధపడుతుంది. ఇంకో ముఖ్యమైన విషయం – తినేటప్పుడు– అక్కడ ఉన్న పదార్థాల ఎరుకలో తినడం. ఎరుకలో తినేవాడు ఆకలి తీరాక "అన్నదాతా! సుఖీభవ" అన్న కృతజ్ఞతాభావంతో వ్యక్తమవుతాడు. ఇదీ తృప్తికలిగిన తీరుకు నిదర్శనం. అతని వ్యక్తీకరణే సద్గురు దర్శనం. కురిసిన వర్షం మట్టిలో ఇంకి, మట్టియొక్క స్వభావాన్ని మార్చి మనిషికి ఫలితాలనిస్తున్నట్లే, మనలోని స్వభావాలను మార్చేందుకు, మలచేందుకే శ్రీసాయి భిక్ష చేసినా, గురుదేవులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయక సత్సంగానికి సాగినా! సృష్టిని, సృష్టినియమాలనే శాసించగలిగిన ఆ దేవాధిదేవులకు 'భిక్ష'లు, 'దక్ష'లు అవసరమా! మన జీవితంలో దీపాలను వెలిగించడానికే వచ్చారు ఆ సద్గురుచంద్రులు. దైవసాన్నిధ్యంలో మనలను 'నివేదన'గా సమర్పించడానికి తమ ఆచరణనే చమురుగా, తమ జీవితాన్నే ప్రమిదగా చేసి 'ఏకత్వమనే' ఒత్తిగా మనలను నిలవమన్నారు.

**చివరగా ఒక్క విషయం–ఆచరణ లేని ఆలోచనలు రంగురాళ్ళు. అవగాహనతో సాగే ఆచరణలు జాతిరత్నాలు. సద్గురు అనుగ్రహ వెలుగులలో, తత్త్వశోధనల ఆనందజలధిలో ఆ 'చరణాల'లో లభించగలవు జ్ఞానరత్నాలు. ఆచరణల అడుగులతో శిరిడీకి చేరదాం. అవగాహనా పుష్పాలతో సద్గురువును పూజిద్దాం. సద్గురు చరణం... శరణం..**

**–గురుకృప**



## గురుపూర్ణిమ

గురువుగారు అంటున్నామంటే – మనం శిష్యులం కావాలి. గురువు అంటే నేర్పేవారు, తెలిపేవారు, నేర్చుకునేలా చేసేవారు, ప్రయోజకుల్ని చేసేవారు. సమాజంలో స్వధర్మ నిర్వహణను నిర్వర్తించేలా చేసేవారు.

మనలో నిద్రాణమైన నేర్చుకోవాలనే దృక్పథాన్ని మేల్కొల్పుదాం. 'గురుపూర్ణిమ' బాబా చెప్పిన ఒకే ఒక పండుగ. కనుక సాయిపథగాములకు, సద్గురు పథగాములకు 'గురుపూర్ణిమ' ఒక మహోత్సవం. గురుశిష్య సంబంధంలో గురుపూర్ణిమ అతి పెద్ద కార్యక్రమం. ఎందుకంటే గురువులేక ఎవరూ గమ్యం చేరుకోలేరు కనుక. ఈ రోజుని 'నేర్చుకొని' అర్థం చేసుకోగల ఉత్సవం అనడం కన్నా, 'అనుభవమనే' మహాసాగరంలో మునక వేయడం అని చెప్పాలి. ఈ ఉత్సవం మాటలకందని అనుభవం, నిరాకార రూపం. ఎందుకంటే గురువు తన శిష్యుని హృదయంలో జీవిస్తారు. "నేను అందరి హృదయాలలో చైతన్య రూపంలో ఉన్నాను" అన్నారు శ్రీసాయి.

సద్గురువులు సామాన్యులు కారు. భగవంతుని యొక్క మహాచైతన్యం. వారు భగవంతుని ప్రతినిధులు. సద్గురువు భగవంతుని ప్రణాళికతో భువిపై అవతరిస్తారు. శిష్యుడిని ఎన్నుకొని, దరి చేర్చుకొని, రప్పించుకొంటారు. ఆ అయస్కాంత కక్ష్యలో ఉంచడం వారి కార్య ప్రణాళికలో ముఖ్యఅంశం. "నా చర్యలు, అగమ్యాలు, అగోచరాలు, అనూహ్యాలు" అన్నారు శ్రీసాయి.

వారి పనులన్నీ ఊహకందనివిగా, ప్రత్యేకమైనవిగా, అరుదైనవిగా ఉంటాయి. సామాన్య పద్ధతుల్లో వాటిని అర్థం చేసుకోవడం కుదరదు, అంచనా వేయడం అసలు కుదరదు. అవి అన్నీ ప్రేమ, అవ్యాజ ప్రేమ, అనన్య ప్రేమ, అనంతప్రేమ, అఖండప్రేమ కారణంగా జరుగుచున్నది. మనలోని ప్రేమ పెరిగితే వాటిని అర్థం చేసుకోగలం, అనుభూతి చెందగలం. "ప్రేమను పంచుకునే కొలది పెరుగుతుంది" అంటారు శ్రీబాబూజీ. అందుకే సద్గురుపథం ప్రేమపథం.

గురువు ఎన్నో కోణాల్లో ఒకేసారి జీవిస్తారు. వారు ఒకే సమయంలో వేరు వేరు కోణాల్లోని ఎన్నో పనులు పూర్తి చేయవలసి ఉంటుంది. వారి ఈ బహుముఖ జీవనమే ఊహకందని నిగూఢ, నిక్షిప్త రహస్యాలకు కారణం. వారి మాటలు అర్థం కావు. కాని స్పష్టంగా ఉంటాయి. వారు చెప్పే విషయాలన్నీ వింతగా ఉన్నా, చివరికి అదే జరుగుతుంది (శ్యామా–మరదలు వృత్తాంతం). వారి సంకల్పాలు





**ఎంత పరిహాసప్రియులో... అంత పరమార్థ ప్రియులు.**

**ఎంత సరసులో... అంత సంస్కర్త.**

శ్రీబాబూజీ తమచుట్టూ చేరినవారితో సరదాగా మాట్లాడుతూ (నవరసాల్లోని హాస్యం, ఆనందాన్నిచ్చేదేగాని, ఎవరినీ కించపడేట్లు చేసేది కాదు.) అప్పుడప్పుడు మనలోని తప్పులు, లోపాలు, బలహీనతలు, అలవాట్లు, ప్రవర్తనమీద హాస్యోక్తులు వేసేవారు. (నిద్ర– శిరిడీలో తొమ్మిది గంటలకు కుక్కలు కూడా నిద్రపోవు) శ్రీబాబూజీ హాస్య చతురతతో చెప్పే విషయాలు విని సత్సంగంలో నవ్వుల పువ్వులు విరబూసేవి. సత్సంగం ఆసాంతమూ ఆ గంటన్నర, రెండు గంటలపాటు భక్తులందరూ పెద్ద పెద్దగా నవ్వుతూనే ఉండేవారు.

వారి హాస్యానికన్నా ఆ మాటలోని మర్మం (అంతరార్థం) అర్థం కావలసినవారికి అర్థమై, స్ఫూర్తి రగిలించే సద్గురు ప్రబోధమయ్యేది. ఆ సునిశిత హాస్యం మనలోని అహంకార పొరలను కరిగించేది. మనకూ వారికి మధ్య అడ్డుగా ఉండే దూరాన్ని తగ్గించేది.

వారి సన్నిధిలో మనకిష్టమున్నా లేకున్నా మన వ్యక్తిత్వం స్పష్టంగా కనిపించి మన ఆలోచనా విధానమేమిటో, మనస్థితి ఏమిటో తెలియచేస్తుంది. ఒకరు అడిగిన ప్రశ్నకు వారిచ్చిన సమాధానం అక్కడున్న చాలామందిలో అవ్యక్తంగా ఉన్న ఎన్నో అనుమానాలను నివృత్తి చేసేది. ఎప్పటినుండో మనలో భద్రంగా పేరుకొని ఉన్న సంకుచిత భావాలను వారు సున్నితంగా ప్రశ్నించి, మనలను సరైన రీతిలో ఆలోచింపచేసేది. ఆ ఒక్క సమాధానమే ఎవరికి ఎలా చేరాలో అలా చేరేది. ఎవరికి వారు తమను ఉద్దేశించే చెబుతున్నారని భావించేవారు. "ఆ మహాత్ముని దివ్య సన్నిధిలో ఉండటం ఓ మహత్తరమైన 'సత్సంగం'. ఆ మహాత్ముని వాక్సుధను ఆస్వాదించడం మరో అద్భుతమైన 'సత్సంగం'. ఆ సన్నిధిలో సత్స్వరూపానందం అనాయాసంగా అనుభవమవుతుంది." –సాయిదీవెన

## Alexander - The Great

Alexander ప్రపంచాన్నే జయించాలనే లక్ష్యంతో బయలుదేరి, జయిస్తూ చివరిగా ఇండియాలోకి వస్తాడు తన సైన్యంతో. అతను తన మజిలీకి దగ్గరలో ఉన్న ఆశ్రమంలో ఓ చెట్టుక్రింద నిశ్చలస్థితిలో ఉన్న సాధువుని చూస్తాడు. ఏ పని చేయకుండా అలా ఖాళీగా, నిశ్చలంగా ఉన్న స్వామిని చూసి ఆ స్వామిని కలిసి అడగాలనుకుంటాడు. ఒకరోజున స్వామి దర్శనం కోసం వెళతాడు. లోపల నున్న



పలకరింపులు, ఏమీ అడగకపోతే వారెక్కడ వెళ్ళిపోతారో అని మేము వేసే సాగతీత ప్రశ్నలు. ఇలా ఆనాటి మొత్తం సన్నివేశం మనోనేత్రం ముందు కదలాడింది. ప్రశ్న ఒక్కటే అయినా వాటి వెనుక అవ్యక్తంగా ఉండే ఎన్నో ప్రశ్నలను సమాధానపరిచే వారి సమగ్రమైన సమాధానాలు, అడగటం నేర్పే వారి ఓర్పు, అనునయంగా వివరించి చెప్పే నేర్పు, సరిదిద్దుకోమని వారు చేసే హెచ్చరికలు, నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా తేల్చేసే విషయాలు, ఇలా గురువుగారి సత్సంగం ఓ గొప్ప Learning Experience సత్సంగం జరుగుతున్నంతసేపూ ప్రపంచంలో వారూ మనమూ మాత్రమే ఉన్నామనిపిస్తుంది. ఆ ఆనందం కొన్ని క్షణాలైనా పొందడానికి జీవితాంతం వేచివుండవచ్చంటే అతిశయోక్తి కాదు.

సత్సంగం వింటూ ఉంటే మధ్యలో ఆ ఆడియోలో ఏదో అలజడి. అప్పుడు గుర్తొచ్చింది నాకు ఆ సత్సంగంలో మధ్యలో ఒకసారి ఎవ్వరూ ఏమీ మాట్లాడకపోయేసరికి ఇక చాలని లేవబోయారు గురువుగారు. అప్పుడు సార్, సార్ అంటూ అందరూ ఏదో ఒకటి అడగడానికి సిద్ధమయ్యారు.

అదీ ఆ అలజడి. అప్పుడు వారు నవ్వుకుంటూ మళ్ళీ కూర్చున్నారు. ప్రమాదం తప్పిందని అందరం ఊపిరి పీల్చుకున్నాం. నిజానికి గురువుగారు అలాగే వెళ్ళిపోయినా మారు పలికేదెవరు? కానీ మా ఆతృతను చూసి కూర్చున్నారంతే. గురువుగారు ఏం చేసినా బాగుంటుంది. ఆ శైలి ఇంకెవ్వరికీ రాదు. సత్సంగం అంతా అయిపోయాక అందరూ వారి పాదాలకు నమస్కారం చేసుకునేవారు. అంతసేపూ వారు అలా నిలబడి ఉండేవారు. నమస్కారం చేసుకునే ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించేవారు. ఆయన ప్రేమ ప్రతి చూపులో, పలుకులో స్పష్టంగా కనిపించేది. ఆ సత్సంగంలో గురువుగారితో నేను కూడా ఉన్నానన్న ఆలోచన ఎంతో ఆనందాన్నిచ్చింది. క్రమంగా మనస్సు స్పీకర్‌లో వస్తున్న మంత్రముగ్ధమైన వారి మాటలలో లీనమయింది. గడిచిన అనుభవాలన్నీ జ్ఞాపకాలుగా మనస్సులో నిక్షిప్తమవుతాయంటారు. కానీ గురువుగారితో మనకున్న అనుబంధమనే అనుభవం ఒక జీవనది, అది అఖండంగా నేటికీ కొనసాగుతూనే ఉంది. ఆయన సాన్నిధ్యంలో గడిపిన ఏ క్షణమూ గతం మిగిల్చిన జ్ఞాపకం కాదు, వర్తమానాన్ని నడిపించే సజీవమైన వాస్తవం. వారి సాన్నిధ్యం కాలానికి అతీతం. ఆయాచితంగా ఆ సన్నిధిని మనకు ప్రసాదించిన ఆ ప్రేమమూర్తికి కృతజ్ఞతాపూర్వకంగా నమస్కారాలు తప్ప ఏమి చేయగలం. - ఫణి (చెన్నై సత్సంగం న్యూస్‌లెటర్ నుండి సంగ్రహించబడింది.)





ఎప్పుడూ సంపూర్ణాలే. వారి ఆలోచనలు క్రియాన్వితాలు, ప్రభావితాలు. అందుకే వారు అనుకోగానే అన్నీ జరిగిపోతాయి. ఆశీర్వదిస్తే లోకకళ్యాణం జరుగుతుంది. అందుకే సద్గురువు యొక్క ఆలోచనలు, మాటలు, చేతలు ఎప్పుడూ శ్రేయస్సునే అందిస్తాయి.

అట్టి సద్గురు జీవితం, జీవనం, సామాన్య శిష్యుడికి ఏమి అర్థం అవుతుంది? సచ్ఛిష్యుడు గురువు ఆదర్శాన్ని దర్శిస్తూ, ఆ నడక, నడతలను గమనిస్తూ, ఆయన ఒడిలో తన జీవితాన్ని సమర్పించుకొని, (ఒడి అనే బడిలో ఒదిగి) నిశ్చింతతో ఎదుగుతూ, వికసిస్తుంటాడు. ఎట్టి పరిస్థితులలోనైనా నిశ్చింతగా ఉండగలడు. గురువు మాత్రం నిరంతరం అప్రమత్తతతో ఉంటాడు. "మీరు ఎక్కడున్నా ఏమి చేస్తున్నా, నాకు తెలుసు అన్న గమనింపులో ఉండండి" అన్నారు శ్రీసాయి. ఆ గమనింపు, ఆ గురుతు, ఆ ఎరుకలే మనల్ని నిశ్చింతగా నిలిపేవి, ఎదిగేట్టు చేసేవి. అట్టి అప్రమత్తతతో శిష్యుని సమర్థునిగా చేసి, అభ్యుదయ పథం, ప్రగతిపథం అయిన సద్గురుపథంలో ముందుకు నడుపుతూ గమ్యం చేరుస్తారు. ఈ బాధ్యత గురువుది. ఈ శరీరానికి, మృత్యువుకి సంబంధం లేని బంధం – గురుశిష్య సంబంధం ఒక్కటే. ఈ బంధం జన్మజన్మలు కొనసాగుతుంది. గురుశిష్య సంబంధం అలౌకికమైనది, అరుదైనది, విలువైనది, దుర్లభమైనది.

గురువు చేసే ప్రతి చర్య విలక్షణంగా, విశిష్టంగా, అద్భుతంగా ఉంటుంది. వారి ప్రేమ, ఆప్యాయత, ఆత్మీయత అసాధారణమైనవి. శిష్యుని అంతరాళాల్లోకి వారి ఆప్యాయత చేరుతుంది. దారిలో ఎదురయ్యే అడ్డంకులన్నింటినీ తొలగిస్తుంది. అది చేరవలసిన చోటుకు చేరుతుంది. చేరి స్థిరంగా అచలమై ఉంటుంది. **"బాబాకు దగ్గరవ్వడం అంటే మనమంటూ లేకుండా బాబానే ఉండటం. అదీ నిజంగా బాబాకు దగ్గరవడం. ఎంత దగ్గర అంటే ఇక దూరము, ఇద్దరు అనేటువంటిది లేకుండా పోయినంత దగ్గరగా. ఒక్కొక్క అడుగు ఒక్కొక్క అడుగు మనలను దగ్గరకు తీసుకుంటూ పోతారు. అది ఎక్కడకు దారి తీయాలి? మనం అంటూ లేకుండా బాబానే మిగలాలి" అంటారు శ్రీబాబూజీ. ఇదే సద్గురు ప్రేమ. వారి ప్రేమ శిష్యుడిని తీర్చిదిద్దుతుంది. అట్టి శిష్యుని అణువణువునా గురువు ప్రేమ ప్రవహిస్తుంటుంది, వ్యక్తమవుతూ ప్రకాశిస్తుంటుంది. ఇది మనం కోరవలసింది. గురువు కోరుకునేది ఇదే. వారి కోరిక మన కోరిక అవ్వడమే–మనమంటూ లేకుండా ఉండటం. ఆయనే మిగలడం, ఇది ప్రేమ యొక్క తత్త్వం. "ప్రేమయొక్క తత్త్వం ఎక్కడైనా మనిషిని మెర్జ్ చేస్తుంది" అంటారు శ్రీబాబూజీ.**




సమర్థ సద్గురుని కోరిక తీర్చగలిగే ధైర్యోత్సాహాలతో కూడిన సంసిద్ధతలను సమర్పణ చేయడమే నిజమైన నివేదన, అర్పణ, సమర్పణ. దీని కోసం శిష్యుడు గురువుని శరణు వేడాలి. ఎలాంటి పరిస్థితులనైనా, మానావమానాలను, అపనిందలను, తిరస్కారాలను, మృత్యువును తలపించే కష్టాలను సైతం ఆనందంగా ఎదుర్కోవడడానికి సిద్ధంగా ఉండాలి. ఇదే శిష్యుడు సిద్ధి పొందిన దానికి గురుతు. సంసిద్ధతే – సిద్ధి అంటారు ఓ మహాత్ముడు.

శిష్యునిపై గురువు ప్రేమ వర్షించినపుడు, గురుకృప అవతరించినపుడు శిష్యుని జీవితం ఒక కొత్త జీవితంవైపుకి మరలుతుంది. గురుప్రేమ శిష్యుని కష్టాల మహాసాగరంలోకి నెట్టివేస్తుంది. కష్టాలు, పడే బాధలు చూడటానికి చాలా తీక్షణంగా ఉంటాయి. దేవుడా! నా గురువు నన్ను పట్టించుకోవడం లేదు. (సాయిభక్తి సాధనా రహస్యం – సద్గురు సన్నిధిలో సాధన– దాని తత్త్వశోధన) ఇహ నావల్లకాదు, ఇంక చాలు. అటు చావలేను, ఇటు బ్రతకలేను. (వదిలి వెళ్ళాలనుకుంటాడు, కాని వెళ్ళలేడు) అనిపిస్తుంది. ఈ కష్టనష్టాలన్నీ 'గురుకృప'కు ప్రతిరూపాలు. ప్రతిశిష్యుడూ ఈ యాతనా మార్గంలో పయనించక తప్పదు. కాని వారి దయతో ప్రాపంచిక జీవితం సుఖ సౌఖ్యాలతో నిండిపోతుంది. వారి దయతో పరువు, ప్రతిష్ఠ, భౌతిక వైభవాలు ఏరులై పారతాయి. సద్గురుకృప వర్షించినపుడు కష్టాలనేవి రైలు పెట్టెలలాగా వస్తాయి. ఒకటి దాటిందో లేదో మరొకటి వస్తుంది అంటారు స్వామి వివేకానంద. ఆధ్యాత్మిక శక్తులను ధరించలేని మనసు, శరీరం కలవారిపై గురువు దయచూపి ప్రాపంచిక వైభవాన్ని ప్రసాదిస్తారు. శక్తులను మనస్సులోను, శరీరంలోను ధరించగల సత్తా ఉన్న శిష్యుల చిత్తంలో నిండిపోయిన సంస్కారాలన్నింటిని వారు దుమ్ము దులిపినట్టు దులిపేస్తారు. పాత్రత ఉన్న శిష్యులపై గురుకృప వర్షిస్తుంది. ఈ పాత్రత, యోగ్యతలిచ్చేందుకే... "నా భక్తులు అడిగినవన్నీ ఇస్తుంటాను. నేనివ్వదలచుకున్నవి వారు అడిగేంతవరకు" అంటారు శ్రీసాయి. కాబట్టి "ఆయన ఇవ్వదలచుకున్నది మనం అడగడానికి అనుగుణంగా – దాన్ని ప్రిపేర్ చేసి, దాని ప్రకారంగా తీరుస్తారు కోరికలు" అంటారు శ్రీబాబూజీ.

ఇంకా "బాబా మార్గంలో కాస్త జాగ్రత్తగా ఉన్న వాళ్ళకు ఇంకొక విషయం కూడా ఇట్టే అర్థం అవుతుంది. ఆయనకు, మనకు మధ్య ఉన్న సంబంధం – అడగడం, తీసుకోవడం అనేదే కాకుండా దానికి మించి మనలను ఉద్ధరించడమే" అంటారు శ్రీబాబూజీ. ఆయన బిడ్డలుగా ఎదగడమే. ఆయన వాడిగా ఈ లోకానికి వ్యక్తీకరించడమే. ఇదంతా బాబా మాటల్లోని పరమార్థం.

శిష్యుడు గురువుని వెదకడం కుదరని పని. సద్గురువు (చైతన్య ప్రవాహ ప్రతిరూపం) మన





విరాట్ స్వరూపుని ఆశీస్సులు" అన్నట్లు వ్యక్తమయ్యేవి. ఇలా ఎన్నో అనుభవాల మాలలు ఆ సద్గురుచంద్రుని చెంత.

ఆ సద్గురు చంద్రుని అనుగ్రహ వెన్నెల ధరాతలమంతా శోభిస్తూనే ఉంది. ఆ చల్లని ఆశీః వెన్నెలలో విహరిస్తూ, ఆ ధవళకాంతులను ఆస్వాదిస్తూ, ఆ పండువెన్నెల మన(సు)లోని చీకట్లను తొలగిస్తోందన్న ఎరుకలో నిలుస్తూ, ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఉన్నా ఆ వెన్నెల మాత్రం మనపై వర్షిస్తూనే ఉన్నదన్న విశ్వాసంలో, తల్లి ఒడిలో బిడ్డ ఏ చింతా లేక నిదురిస్తుందో, అలా వెచ్చగా, వైభవోపేతంగా జీవిద్దాం. మనందరం ఆ సద్గురు మహరాజ్ శ్రీబాబూజీ బిడ్డలం. మనందరం రాజకుమారులం. రాజకుమార్తెలం... అదిగో గురుచంద్రుడు... అదిగో గురుని అనుగ్రహ వెన్నెల... ఆస్వాదిద్దాం.. ఆనందంగా ఉందాం... సర్వులకు గురుచరణాలే రక్ష.. శుభం భవతు.. సద్గురు చరణామృత ప్రాప్తిరస్తు...

**–గురుకృప**

## గురుదేవుల సత్సంగం గురించి...

ఇంకాసేపటిలో గురువుగారి సత్సంగ ఆడియో ప్లే చేస్తారు. అందరం మందిరం వెనుకభాగంలో ఉన్న ప్రాంగణంలోనికి వెళ్తూ ఉన్నాము. ఆ ప్రదేశం చాలామందికి సుపరిచితమే. అక్కడే గురువుగారు ఎన్నో సత్సంగాలు చేసారు. ఎందరితోనో ఆప్యాయంగా మాట్లాడారు. ఊదీ ఇచ్చి ఎందరికో స్వాంతన చేకూర్చారు. ఎన్నో విశేషాలు, మరెన్నో విశేషణలు ఒక్కొక్కటిగా, అన్నీ ఒక్కటిగా గుర్తుకు వస్తుండగా లోపలికి ప్రవేశించాము. ఎక్కువ చీకటి, తక్కువ వెలుగు. లోపల ఏ కొద్దిమందో ఉంటారనుకున్నాం. కానీ లోపల దాదాపు మూడు నుండి నాలుగువందల మంది ఉన్నారు. అంతా నిశ్శబ్దం. అక్కడక్కడా మాటలు వినిపిస్తున్నాయి. అవి గురువుగారివే. అదాటున చూస్తే అక్కడ గురువుగారున్నారా అనిపించింది. ఒక్కక్షణం మనస్సు నిరుత్తరమైంది. గురువుగారి సత్సంగం ఉన్నపుడు వారి పాదాల వద్ద కూర్చోవడానికి, కాళ్ళు పట్టడానికి పోటీలు పడి పరుగులు పెట్టిన సందర్భాలెన్నో మదిలో మెదిలాయి. కాసేపటికి మనస్సు వాస్తవంలోనికి వచ్చి, సత్సంగం వినడానికి ఆయత్తమవుతూ ఉంటే మనస్సు మళ్ళీ గతం లోనికి జారిపోయింది. నిజానికి గతమేదో, వర్తమానమేదో తెలియని స్థితి అది. అక్కడే, అదే ప్రదేశంలో, అదే సత్సంగాన్ని గురువుగారి పాదాల వద్ద కూర్చుని విన్న వాళ్ళలో నేనూ ఒకడిని. అప్పుడు వారు నవ్విన నిండైన నవ్వులు వారు పేల్చిన జోకులకు పొట్ట చెక్కలయ్యేలా నవ్విన నవ్వులు, "ఇంకేంటయ్యా, చెప్పండయ్యా" అంటూ ఉత్సాహంగా వారి



సరస్వతీస్వామివారు. పై సంఘటనలో స్వామివారి ధర్మాకృతి మాత్రమే దర్శిస్తే సరిపోదు. స్వామివారి ధర్మాకృతి ఓ వంక దర్శనమిస్తుంటే – వారి సర్వవ్యాపకత్వం – ఈ సంఘటన నేపథ్యంలో అఖండజ్యోతిలా దర్శన మిస్తుంది. చంద్రమౌళీశ్వరునితో చెప్పుకుంటే, వారికి చెప్పినట్లే అంటే అసలు వారి స్వరూపమేంటి? జగత్తంతా నిండిన దైవంతో వారు ఏకత్వభావనలో ఉన్నట్లా? అసలు వారే దైవమా? పతనమవుతున్న జాతిహితం కోసం, దారీతెన్నూ తెలియని బిడ్డల కోసం పదమూడేళ్ళ బాలుడుగా పీఠాధిపత్యం వహించి ఎందరో ఆర్తులకు దారి చూపడానికి దైవమే దివినుంచి భువికి దిగివచ్చిందా? తలపుల తలుపులు తెరచి ఉంచుదాం. ఈ నేపథ్యంలోని జ్ఞానరత్నాలను శోధిద్దాం.

మహాత్ముల మానసాలు–బిడ్డల ప్రగతికై పరితపించే మాతృహృదయాలు. ఎంతో అరుదుగా కానీ వారి స్వస్వరూపాలు వ్యక్తం కావు. వారి విరాట్ స్వరూపాలు విశ్వమానవాళి దర్శించలేదు. ఎప్పుడూ "అల్లామాలిక్ హై", "భగవంతుడే యజమాని" అని పలికే శ్రీసాయిబాబా "నేనే దైవాన్ని" అన్న మాటను ఒక వ్యక్తావ్యక్త స్థితిలోనే పలికేవారు. శరణాగతి చెందిన సచ్ఛిష్యుడు సద్గురుతత్త్వాన్ని అచంచల విశ్వాసంతో నిలుపుకోగలుగుతాడు. విశ్వసించిన సద్గురు స్వరూపమే దైవమని అంత సులువుగా చిత్తానికి అవగతం కాదు.

ఈ సృష్టిలోని ప్రేమనంతా ప్రోది చేసి, ఈ జగత్తులోని కరుణనంతా రంగరించి, శ్రీసాయినాథులు (మాపై) తమ మాతృప్రేమను – మా గురుదేవులు శ్రీబాబూజీగా ఒక అమృతానందరూపంగా మాకందించారు. తల్లి తాబేలు తన బిడ్డలను ఎక్కడ ఉన్నా పాలించినట్లు మా గురుదేవులు మమ్ము కాచుకుంటున్నారు. వారు త్రికాలవేదులు. "వారి నోటి నుండి కూడా సతతము "సాయిబాబా.. సాయిబాబా" అని, "సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి" అన్న మాటలే వినిపించేవి. అయితే ఆశ్రయించిన బిడ్డలకు మాత్రం వారు దైవమని అవగతమయ్యేది. ఎన్నో వేల మైళ్ళ దూరంలో ఉన్న భార్యాభర్తలు వారి ఇంట్లో మా గురుదేవుల గురించి తలపోసిన ఊసులు – వారి భౌతిక దర్శన సమయంలో సంభాషణలుగా వారి మాటల్లో వ్యక్తమయ్యేవి. చిన్నారిబాలుడు శ్రీసాయినాథుల గురుస్థానంలో అడిగిన యాభై రూపాయలు "అనసూయా! వాడికి యాభై రూపాయలు కావాలట! ఇవ్వు!" అంటూ సాగిన వారి పల్కులు – "సమర్పించిన శ్రీసాయిచరణ వినతులు – వినిపించెను





పాత్రత, గ్రహణశీలతను బట్టి వారు మనల్ని రప్పించుకుంటారు. 'గురుపూర్ణిమ' ఈ సమయంలో మనలో నిద్రాణమై ఉన్న శిష్యత్వాన్ని మేల్కొల్పాలి. అందుకు మనం ఎప్పుడూ జాగురూకులమై ఉండాలి. మన భావాలలో, ఆలోచనలలో, చేతలలో, మాటలలో మన ఆరాధ్య పరమపూజ్య గురుదేవులు అవతరించెదరు గాక! వారికి తగ్గట్టుగా మన జీవనం సాగాలి. అప్పుడు మన హృదయం వారి నెలవవుతుంది. అట్టి సాధన మనం చేయాలి. అట్టి త్రికరణశుద్ధి కోసం ప్రయత్నించాలి. ఈ ప్రయత్నమనే అడుగు ఈ గురుపూర్ణిమ నుండి ప్రారంభిద్దాం. అలా సంకల్పిద్దాం. గురువు నడిచి చూపిన బాటన నడవడంతోనే శిష్యత్వ పాత్రత లభిస్తుంది. అప్పుడే ఈ జీవితానికి చరితార్థత. "ప్రతి ఒక్కరిలోనూ ఏదో పొందాలనే తపన, ఆ పొందాలనే దానికి ఓ రూపునివ్వలేని అస్పష్టత. ఆ అస్పష్టతకు శ్రీసాయివంటి సద్గురు సన్నిధిలో ఓ స్పష్టమైన రూపు వచ్చి, తనకు కావలసినదే తెలుసుకునే సామర్థ్యం కలిగి, అవి తీరగల పరిస్థితులు సంభవిస్తాయి" అంటారు శ్రీబాబూజీ.

మనందరం ఎదురుచూసే మహోత్సవం, అసాధారణ ఉత్సవం, మహా పర్వదినం గురుపూర్ణిమ. ఆత్మీయత, ఉత్సాహం వెల్లివిరిసేదే ఉత్సవం. ఏ ప్రయాస లేకుండా మీరు తట్టుకోలేనన్ని వరాలు కురిపించే పర్వదినం గురుపూర్ణిమ.

– గురుకృప

## వినిపించెను ఆరతి గీతం - కనిపించెను సద్గురు రూపం

**చంద్రశేఖర 'బృందావనం' - కంచి**

'గురుకృప' పత్రికలో చంద్రశేఖర సరస్వతీస్వామి వారి చరిత్ర చదువుతూ ఒకసారి చెన్నపట్నం వెళ్ళినపుడు 'కంచి'లోని స్వామి వారి సమాధి స్థానాన్ని దర్శిద్దామన్న తలంపు కలిగింది. సరే ! మా బావమరిదిని అడిగాను "వెళదామా?" అని. సంతోషంగా మా చెల్లి, అల్లుడుతో కలిసి కంచి శ్రీమఠానికి వెళ్ళాము. ఇక్కడ ఒక విషయం మీతో పంచుకోవాలి. శ్రీసాయి చెప్పినట్లు "నా భక్తులు ఎంతదూరాన ఉన్నా సరే! పిచ్చుక కాలికి దారం కట్టి లాక్కొన్నట్లు, రకరకాల మిషలపై వారిని నా దగ్గరకు రప్పించుకుంటాను" అన్న మాటల్లో వారి చెంతకు రావడానికి వారు ఎంచుకున్న మిష 'ఆరతులు'. బాబా 'ఆరతుల' కోసమే బాబా వద్దకు వచ్చి, 'సాయిభక్తి సాధనా రహస్యమనే' మిషతో శ్రీవారి చెంతనే ఉండిపోయిన వాడిని నేను. కంచిస్వామివారిని 'సజ్జన హృదయ పీఠాధిపతులంటూ శ్రీవారు కీర్తించడం నా హృదయాన్ని బాగా ఆకర్షించింది. చంద్రమౌళీశ్వరసేవ చేసేవారు స్వామి అని



చదవడంతో నాకెందుకో అది ఎలా జరుగుతుందోనన్న కుతుహలం. కానీ నాకు అది ఏ సమయంలో జరుగుతుందో తెలియదు. మేము ఉదయం 10.30 గంటలకు కంచి మఠ ప్రాంగణానికి వెళ్ళాము. ఒక గంట చంద్రశేఖరుల సమాధి స్థానము 'బృందావనం'లో గడిపాక అక్కడి భక్తులనడిగితే ఇదిగో ఒక 15 ని.ల లోపు చంద్రమౌళీశ్వర అభిషేకం జరుగుతుందని చెప్పారు. ఏది సకాలమో నాకేమి తెలుసు. సద్గురు అనుగ్రహం ఉంటే 'అకాల'మే లేదు అన్ని కాలాలు సకాలమే కదా! శంకర విజయేంద్ర సరస్వతీస్వామి వారి చేతులమీదుగా సాగిన చంద్రమౌళీశ్వర సేవాశోభ, ఆరతుల దర్శనం రెండూ చక్కగా అయ్యాయి. గురువుగారు ప్రణాళికా బద్ధంగా చేసిన ఏర్పాటు గుర్తు చేసుకుంటూ వారి మాతృప్రేమకు మురిసిపోతూ చెన్నపట్టణం చేరాను.

***శ్రీరామకృష్ణుల సమాధి స్థానం బేలూరు :*** వృత్తిరీత్యా కోల్‌కతాలో పని ఉండడం, ఇంతకుముందు నేను బేలూరు మఠ ప్రాంగణానికి వెళ్ళడం, మూర్తి త్రయ సమాధి స్థానాలలో ఒక చక్కటి అనుభూతికి లోనవ్వడం శ్రీరామకృష్ణుల శిష్యుల జీవితాలు, వారి ఆశయాలు, వారి నిష్ఠ సబూరీ ప్రభావం నాపై కొంత ఉండడం – జూన్ నెలలో సాయంత్రం నాపని అయ్యాక నేనున్న ప్రాంతం నుండి బేలూరు వెళ్ళడానికి ఉపక్రమించాను. నాకు పైన చెప్పినట్లు 'ఆరతుల' ప్రక్రియ బాబాను గుర్తు తెచ్చేదిగా ఉండటంతో సాయంత్రం ఆరతి సమయానికి బేలూరు బయలుదేరాను. నేను బయలుదేరిందే సాయంత్రం అయిదు గంటల నలభై నిమిషాలకు. కారు డ్రైవర్‌ను అడిగితే సుమారు గంటన్నర సమయం పడుతుందన్నాడు. సాయంత్ర ఆరతి శిరిడీలో లాగే సూర్యాస్తమయానికి ప్రారంభమవుతుంది. గూగుల్ మాప్స్‌ను ప్రశ్నిస్తే గంటా నలభై నిమిషాలు అని తేలింది. సరే దర్శనప్రాప్తి మాత్రమే అని బాధపడుతూ గురువుగారి ఆశీస్సులకై వేచి చూస్తున్నాను. ఇక ఇరవై నిమిషాల ప్రయాణం తర్వాత "సార్! నేను ఒక కొత్త దారి ప్రయత్నం చేస్తా, మన అదృష్టం బాగుంటే బేలూరు త్వరగా వెళ్తాం" అన్నాడు డ్రైవర్. అయిష్టంగానే నీ ఇష్టం అన్నాను. ఖచ్చితంగా 30 ని॥ల వ్యవధిలో రామకృష్ణ మఠ ప్రాంగణంలో ఉన్నాను. అర్థమైంది. స్వామికి ఒక ప్లాన్ ఉంది. మనం చూస్తూ ఉంటే చాలని ! తీరా శ్రీరామకృష్ణుల సమాధిహాల్‌కు వెళ్ళే సరికి పూర్తి హాలు నిండిపోయి ఉంది. భక్తులతో ! ఆరతి ప్రారంభం కాలేదు ! నాకేమో సద్గురుతత్త్వాన్ని ఎంతో ఆర్ద్రంగా కీర్తించే "ఖండన భవబంధన..." ఆరతి గీతాన్ని తనివి తీరా ఆస్వాదించాలని ఆశ. ఎక్కడో వెనుక కూర్చొంటే అది కష్టం. **ఎక్కడ**






వారు నడిచిన బాటకు వన్నె తెచ్చే వారే సచ్ఛిష్యులు. చంద్రశేఖరులు వారి గురుకీర్తి పతాకను తమ రాజీపడని సద్ధర్మాచరణనే స్థంభంగా, కఠిన నియమాల 'తంత్రి'తో నేల నాలుగు చెరగుల దర్శనమిచ్చేట్లు ఎగురవేసారు.

పరమాచార్యుల ధర్మనిరతిని, సర్వవ్యాపకత్వాన్ని కళ్ళకు కట్టినట్టు దర్శింపచేసే మరో సంఘటనను దర్శిద్దాం. పైన ఉదహరించుకున్నట్లు స్వామివారు ఎప్పుడూ నాలుగు గోడలు ఉన్న అంతరంగిక మందిరంలో ఉండలేదు.

ఒకనాడు స్వామివారు విడిది చేసిన చోటుకు ఒక నడివయస్కురాలైన మహిళ పెద్దపెట్టున రోదన పెట్టుకుంటూ వచ్చింది. తనకున్న కష్టాన్ని స్వామితో విన్నవించుకోవాలని ఆమె ఆలోచన. స్వామివారున్న చోటుకు ముందువైపున ఉన్న గదిలో మఠ మేనేజర్ ఉన్నారు. ఆ స్త్రీమూర్తి ఆదుర్దా చూసిన మేనేజరు 'స్వామివారు – ఆ వెనుక భాగంలో విడిది చేసి ఉన్నారు – వెళ్లవచ్చు' అని చెప్పారు. ఆ మాటలు స్వామివారి చెవిన ఎలా పడ్డాయో తెలియదు కానీ, స్వామివారు హెచ్చిన స్వరంతో "మేనేజరుగారు మొదట మీరు లోనికిరండి" అని ఆజ్ఞాపించారు. కంగారుపడ్డ శ్రీకార్యం పరుగున స్వామివారి చెంతన చేరాడు. సదైక స్థితిలోనే నిలిచే స్వామివారు తమ ఏకవస్త్రాన్ని తలపై నుండి తొలగించి తమ హృదయభాగంపై అచ్ఛాదన కూడా లేకుండా గట్టిగా ఇలా అడిగారు. "చెప్పండి – నేను మీకు ఇప్పుడు ఎలా కనిపిస్తున్నానో" వెంటనే "స్వామీ మీరు నాకు మూర్తీభవించిన కామాక్షిలా దర్శనమిస్తున్నారు" అన్నారు శ్రీకార్యం. స్వామివారు "నా శరీరం ఎలా కనిపిస్తోంది?" "మిసమిసలాడే యువకుడైన రూపం" అన్నారు శ్రీకార్యం. "నేను సన్యాసాశ్రమ స్వీకరణ చేసినప్పటికీ ఈ శరీరం అనే ఉపాధి నుంచే నా కార్యమును నిర్వర్తిస్తున్నాను. అంతరంగంలో సన్యసించడమే కాదు, బాహ్యమున కూడా ఎట్టి దోషమునకు తావివ్వకూడదు. ఇది మొదలు ఎన్నడూ నా వద్దకు, ఎట్టి పరిస్థితులలోనూ స్త్రీమూర్తి ఒంటరిగా రావడానికి వీలు లేదు. అన్న, తమ్ముడు, భర్త, అక్క, చెల్లి ఇలా మరో మనిషి లేకుండా నా చెంతకు రాకూడదు. సమయము, పరిస్థితులు ఎంత విషమంగా ఉన్నా సరే, చెప్పుకోలేనంత కష్టం వచ్చింది–అక్కడున్న చంద్రమౌళీశ్వరునకు చెప్పుకోమనండి. అక్కడ చెపితే నాకు చెప్పినట్లే. అక్కడ వింటే నేను విన్నట్లే. ఆ కష్టం తప్పక తీరుతుంది. ఈశ్వరుడు నిర్ణేత – నాది బాధ్యత" అని ఎంతో గంభీరంగా సందేశమిచ్చారు. సందేహం తీర్చారు. మూర్తీభవించిన ధర్మం – ప్రాణం పోసుకొని భూమిపై నడయాడితే అది పరమాచార్యులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర



చెప్పాడు. "ఓహో! అట్లానా!" అన్నారు స్వామి. తర్వాత రోజు భిక్షా సమయం అయింది. స్వామివారు భిక్ష స్వీకరించలేదు. స్వామివారు ఎప్పుడైనా సుస్తీ చేసినా నిరాహారిగా ఉండటం సాధారణ విషయం. అంచేత శ్రీకార్యం (మఠ మేనేజర్) స్వామివారిని ఒత్తిడి చేయలేదు. ఆరోజు మొత్తం స్వామివారు నిరాహారిగానే ఉన్నారు. రెండవరోజు గడిచిపోయింది. మూడవరోజుకు శ్రీకార్యానికి కొంత సందేహం కలిగింది. ఏమైనా తప్పు జరిగిందా మఠంలోగానీ, స్వామివారి భిక్షా కైంకర్యంలోగానీ! పరమాచార్యులను ఆశ్రయించాడు చేతులు జోడించి. స్వామివారి మౌనమే సమాధానం. ఒత్తిడి చేసి వారి నుంచి సమాధానం ఆశించలేని స్థితి. వారం గడిచిపోయింది. మంచినీరు కూడా స్వీకరించడం లేదని తెలిసింది.

సేవకుని ద్వారా అర్థమైన విషయం రోజూ స్వామివారు ఆచమనానికి గోమూత్రాన్ని మరియు ఉసిరికాయ పరిమాణంలో రోజూ గోమయాన్ని (ఆవుపేడ) మాత్రమే ఆహార పానీయాలుగా స్వీకరిస్తున్నారని. ఆశ్రిత జనులంతా స్వామి భిక్ష చేయడం లేదని తెలిసి తల్లడిల్లిపోయారు. శ్రీకార్యం స్వామి వారి చరణాల చెంత సాష్టాంగపడి, తను చేసిన తప్పును తెలియచేయమని భోరుమన్నాడు. అనునయించిన స్వామి ఇలా అన్నారు "రేపటిరోజున నన్ను ఒక గ్రామానికి రమ్మని ఆహ్వానించి, జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతీస్వామివారు వస్తున్నారని, అనుగ్రహభాషణం గావిస్తారని చెప్పి–నన్ను నా 'గురు'స్వరూపంగా భావించి ఆసీనుడ్ని చేస్తే, 'ఇంద్రియాలను జయించాలన్న' మాటను నేను నలుగురికి చెప్పాలంటే 'తోటకూర'కు లొంగిపోయిన నేను ఏ అర్హతతో ఆ మాటలు చెప్పగలుగుతాను? 'శంకరులు' అధిష్టించిన పీఠమును అధివసించి వారి పేరుకు ఆ కళంకం తీసుకురాకూడదు. ఏ నాలుక అయితే రుచికి లొంగిపోయిందో ఆ నాలుకను రోజూ గోమూత్రంతో శుద్ధి చేసి, గోమయంతో తృప్తిపరుస్తున్నాను. మరొకనాడు రుచికి లొంగనంత వరకు ఆ నాలుకకు అదేస్థితి". ఆరోజు మొదలు ఎన్నడూ స్వామివారు భిన్నరుచిలో ఆహారాన్ని స్వీకరించలేదు. జీవిత పర్యంతం కూర, పప్పు, సాంబారు, తీపి, ఇలా అన్నీ కలిపేసి ఏకరుచిగానే భిక్షను స్వీకరించేవారు. ఈ సంఘటన స్వామివారు యువకునిగా ఉన్నకాలంలో జరిగినదే. సద్గురుసామ్రాట్టు శ్రీసాయిబాబా భిక్షా స్వీకరణను తలంపునకు తెస్తుంది స్వామివారి ఆహార నియమం. 'సద్గురు' పదవి అలంకారం కాదు. తమ జీవిత పర్యంతం తమ గురువు చెప్పిన మాటను విడువక, వారు పాదుకొల్పిన ఆశయాలకు,





**ఉన్నా ఆస్వాదించే పరిణితిలేదు. సమయం కన్నా ముందు వచ్చే ప్రణాళిక లేదు. సూర్యుడు రాకమునుపే లేచి రోజంతా కష్టించే శ్రమలేదు. ఏమున్నాయిరా నీకు? అంటే ఆవగింజలో అణువంత మా గురువుగారంటే ఇష్టం (ప్రేమ కాదండోయ్).** దూరంగా కూర్చోలేను! చూస్తూ నిలబడలేను. మా గురువుగారి అనుగ్రహం హాలులో ముందు భాగంలోని ఒక ప్రక్క ఉన్న ద్వారాన్ని ఒక సన్యాస మహారాజ్ తెరవడం– నేను వారికి చేతులు జోడించి నమస్కరించడం– వారు నన్ను లోపలికి వెళ్ళమనడం– సుమారు ఆరతికి కేవలం కొన్ని సెకన్ల ముందు జరిగిపోయాయి. **"వినిపించెను ఆరతి గీతం కనిపించెను సద్గురు రూపం" అన్నట్లు నా సంతోషం అంతా ఇంతా కాదు. ఉద్యోగరీత్యా రోడ్లు పట్టుకు తిరుగాడే వాడితో ఎవరుంటారు చెప్పండి. ఒక్క నా స్వామి తప్ప! అందరూ వదిలేసినా సరే! ఆయనే తోడు– ఆయన నా వాడు.**

***చంద్రశేఖర భారతీస్వామి వారి సన్నిధానం :*** కొన్ని సంవత్సరాల క్రితం లీలగా స్వామి వారి చరిత్రను చదివాను కానీ ఆరోజున ఎందుకో మనసు నిలవలేదు. శృంగేరీ పీఠాధిపతులైన చంద్రశేఖర భారతీస్వామి వారు ఎంతో తపస్సంపన్నులు. కేవలం వారి రూపమే ఒక సూదంటురాయి. భగవాన్ రమణులతో పాటు నన్ను అంతగా ఆకర్షించిన రూపం చంద్రశేఖర భారతీస్వామి వారిది. మామూలుగా నాకు చరిత్రలు, బోధలు పడుకునే చదువుకోవడం అలవాటు. ఎందుకో తెలియదు వారి చరిత్ర చదవడం మొదలుపెట్టాక అప్రయత్నంగా గౌరవ భావంతో లేచికూర్చొని చదవడం జరిగింది. కొంత సమయం గడిచాక గమనించుకున్న నేను వారి చరిత్రను శ్రద్ధతో, ఆనందంగా చదివి ఆస్వాదించాను. శ్రీచంద్రశేఖర భారతీస్వామి వారి సిద్ధి (26.9.54) నుంచి పన్నెండవ రోజు మా గురుదేవుల జన్మదినం (7.10.54). స్వామి వారిని 'మార్మికజ్ఞాని' గా పిలిచేవారు (Mystic Seer). భారత రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్‌గారు శృంగేరీ వచ్చిన సందర్భంలో జన సామాన్యంతో పాటు స్వామివారిని దర్శించుకున్నప్పటి రూపం నన్ను బాగా ఆకర్షించింది. స్వామి గొప్ప మౌని. వందమాటలకు ఒక్కమాట సమాధానం. త్రికరణాలు సదా ఈశ్వర సన్నిధానం. ఒక్కోసారి చంద్రమౌళీశ్వర సేవ (అభిషేకం) చేస్తూ ఏకత్వభావనలో స్మృతి కోల్పోయే వారు స్వామి. ఒక్కోసారి వారికి బాహ్యస్మృతి కలగడానికి రోజులు పట్టేది. జ్ఞానిగా, మౌనిగా, లీలామానుషునిగా ఎందుకో ప్రతీ అనుభవంలోనూ మా గురుదేవులు లీలగా దర్శనమిచ్చేవారు. బాలుడుగా ఉన్న చంద్రశేఖర



భారతీస్వామి వారిని త్వరగా పీఠమునకు ఆచార్యులను చేయమని వారి గురువు శ్లోకాలను రచించి శారదాంబకు విన్నవించేవారు. గురువు ప్రేమకు ఉపమానం ఎక్కడ ఉంది చెప్పండి.

పైన పంచుకున్న అనుభవాలలో గమనిస్తే నేను ఎప్పుడూ బాబాను, గురువుగారిని మరిచిపోయిన సందర్భం కనపడదు. వృత్తిరీత్యా మంగళూరులో ఒక మీటింగ్‌కు వెళ్లడం. తర్వాత రోజు శని, ఆదివారాలు కావడం, నాకు శృంగేరీ వెళ్ళే అవకాశం వచ్చింది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో శృంగేరీ చేరాను. హోటల్‌లో గది తీసుకుని విశ్రమించి ఐదు గంటల సమయంలో మఠ ప్రాంగణానికి వెళ్ళాను. వెళ్ళడమే శారదాంబ దర్శనం– పిలిచి మరీ దగ్గరగా చేయించారు గురుదేవులు. వడివడిగా అడుగులు వేసుకుంటూ చంద్రశేఖర భారతీస్వామి వారి సన్నిధానం (వెతుక్కుంటూ) తుంగానది అవతలకు చేరాను. తుంగానదికి అటూ, ఇటూ చాలామంది పరమగురువుల సన్నిధానాలు ఉన్నాయి. భారతీస్వామివారి సన్నిధానం చేరి ఏదో ఒక మాటల్లో చెప్పలేని అనుభూతిలో ఉన్నాను. ఆ అనుభూతి ఎలాంటిదంటే నేను ఎవరో, నాకు బాబా, గురువుగారు ఉన్నారని, వారి సంకల్పంతోనే ఇక్కడకు వచ్చానన్న ఆలోచన కూడా రాలేదు. ఇన్నాళ్ళు నా భావాల్లో శ్రీచంద్రశేఖర భారతీస్వామివారి పట్ల ఉన్న గౌరవమంతా వారి ముందు సాష్టాంగపడి నమస్కారంగా చెప్పుకున్నాను. ఒక నిమిషం గడిచాక తలెత్తి చూస్తే సన్నిధానం బయట ఒక చిత్రపటం ఉంది. ఏమిటా అది? అని చూస్తే ఏ రూపమయితే నన్ను అక్కడికి చేర్చిందో ఆ రూపం అది. అక్కడున్న పది పదునైదు అధిష్టానాలలో ఎందులోనూ అలా పెద్దదైన రూపంలేదు. ఆశ్చర్యపోయాను. కాకతాళీయ మనిపించవచ్చు కానీ వందల రూపాలుంటే ఆ రూపమే అక్కడ ఎందుకు ఉంది ఏమో? పైన చెప్పినట్లు ఈ నేపథ్యంలో అసలు బాబా, గురువుగారి ఊసేలేదు నా ఆలోచనలో. స్వామి సన్నిధానంలో ఉన్న ఆ చిత్రపటం చూస్తూ ప్రతిక్షణం ఆస్వాదిస్తున్నా! అక్కడ ఒక (నలుగురు లేదా) ఐదుగురు భక్తులు ఉన్నారేమో! ఉన్నట్టుండి వచ్చిన ఒక తల్లీ, తండ్రీ, చిన్న పిల్లాడు వచ్చారు. చిన్నపిల్లాడు స్వామి చిత్రపటానికి నమస్కరించాడు. నాకు గమనింపులేదు. నా ప్రక్కనే నిలబడి వాళ్ళ 'అమ్మ'తో, చెపుతున్నాడు కన్నడంలో "అమ్మా! వారు సాయిబాబా కదూ!" అని. నా వరకు నాకు తలక్రిందులుగా ఉన్న ప్రపంచం సామాన్య స్థితికి వచ్చింది. సద్గురు వసుధైక కుటుంబంలో మా గురుదేవులు నా తండ్రి. చిన్నాన్న, పెత్తండ్రి, మామయ్య, తాతగారు..ఇలా అన్నీ ఆప్యాయతా అనుబంధాలే! తండ్రికి సాటి ఎవరు! ఖచ్చితంగా ఆ చిత్రపటమే అక్కడ! నిర్దిష్టంగా ఆ





జీవులకు హాని కలిగే అవకాశం ఉండడంతో ఎప్పుడూ కాలినడకనే ఆశ్రయించేవారు. ఆసేతు హిమాచల పర్యంతం – కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పాదచారియై భరతభూమిని పవిత్రమొనరించిన పావనమూర్తి పరమాచార్యులు. సన్యాసాశ్రమ ధర్మాన్ననుసరించి రాజాశ్రయమైనా, వనరాజ్యమైనా ఒక్కనాడు కూడా నాలుగు గోడల మధ్య విశ్రమించిన క్షణం లేదు. జీర్ణోద్ధరణకు నోచుకోని ఆలయాలు, చెరువుగట్లు, నదీతీరాలు, చెలములు, మంచినీటి కాలువలు ఇవే వారి నివాసస్థానాలు. వారి జీవితమంతా భక్తకోటి, శిష్యగణం మధ్యే. పరిస్థితి అనుకూలించి తాము కూర్చున్న చోటుకు ఎండా, వాన నుంచి రక్షణగా శిష్యకోటి ఆచ్ఛాదన ఏర్పాటు చేయగలిగితే అక్కడ! లేదా ఎట్టి ఆచ్ఛాదన లేకుండా ఉండేవారు. సర్వకాలములయందు చేతదండము, కమండలము. అరణ్యమైనా! జనారణ్యమైనా చంద్రమౌళీశ్వర సేవకు సమయమైందా – పరివారమంతా ఆగిపోవాల్సిందే. ఈశ్వరుని సేవ సకాలంలో జరగాల్సిందే. వారి ఆహార విషయానికొస్తే – రాయడానికి 'కలం' కదలడం లేదు– 'కాలం' కదిలి వెళ్ళిపోతోంది.

దేహం నిలవడానికి ఆహారమేగాని, దేహానికి తృప్తి కలగడానికి ఆహారం కాదు. పర్వదినాలు, పుణ్యతిథులన్నింటిలోనూ వారు నిరాహారులే. స్వామి విషయంలో 'ఉప'వాసం అనడం తెలివి తక్కువతనమవుతుంది. స్వామి సర్వకాల, సర్వావస్థలయందు ఉపవాసమే కదా! (సమీపము–దైవసాన్నిధ్యము) జిహ్వను జయించిన జితేంద్రియులు పరమాచార్యులు. ఇదిగో ఒక చిన్న సంఘటన– స్వామి చేతల వేదాంతి అని తెలియచెప్పేది. పీఠాధిపత్యపు ఆచార్య స్వాములకు షడ్రసోపేతమైన భోజనం ఏర్పాటు చేయబడుతుంది. అది పీఠ సాంప్రదాయం. కానీ స్వామిత్వం వహించిన వారు మాత్రం రుచులకు లొంగిపోకూడదు. కఠిన వైరాగ్యం–అన్నీ అందుబాటులో ఉంటాయి–వేటికీ లొంగకూడదు. ఒకరోజు స్వామివారి భిక్షా కైంకర్యం జరుగుతోంది. శ్రీమఠం సేవకుడు భోజనం వడ్డిస్తున్నాడు. భోజనంలో పప్పు వడ్డించాడు. స్వామి "దేనితో చేసిన పప్పు ఇది" అని అడిగారు. ఇది "తోటకూర పప్పు స్వామి, బాగుందా!" అని అడిగాడు సేవకుడు. స్వామి నోటివెంట 'బాగుంది' అని సమాధానం వచ్చింది. సంతోషించిన సేవకుడు మరునాడు కూడా తోటకూర పప్పుతో భిక్షావందనం చేసాడు. స్వామివారు మెల్లగా అతనిని అడిగారు "తోటకూర ఎక్కడిది" అని. "మీరు తోటకూర పప్పు బాగుందని చెప్పడంతో మన పరివారం కట్టలకొద్దీ తెచ్చారు" అని అసలు విషయం



**స్ఫూర్తినిచ్చే రసస్ఫోరకాలు. అద్భుత ఆధ్యాత్మిక జీవిత హర్మ్యానికి ప్రధాన ద్వారాలు".** (సాయిపథం జూన్-జూలై1992). వారసత్వంగా భోగాలు, రోగాలు కూడా రావచ్చునేమో. సద్గురుప్రేమ సామ్రాజ్యంలో పౌరసత్వం లభిస్తే వచ్చేవి మాత్రం యోగాలు, చక్కటి సంస్కారాలు. రసస్ఫోరకమైన స్ఫూర్తినిచ్చే చంద్రశేఖరుల చరిత్ర – భక్తి, జ్ఞాన, వైరాగ్య అవతరణిక అయిన వారి నడయాడిన దివ్యత్వాన్ని దర్శించగలిగేందుకు మా గురుదేవులు వెలుగుదివ్వె అయి, మార్గం చూపుతున్నారు. గురుకృపతో పంచుకుంటున్న ప్రతీ అక్షరం వారు పాదుకొల్పిన సంస్కారం మాత్రమే! సద్గురురాయా! కృపాసాగరా! వర్షించే మీ అనుగ్రహం ప్రతీక్షణము అవగతమవుతూనే ఉంది. సదా నీడలా మా వెన్నంటి ఉండి కాపాడే మీ పదముద్రలు అగుపడుతూనే ఉన్నాయి. గురుదేవా! మీ స్మరణే మాకు స్ఫూర్తిదాయకం. మీ రచనలు మాలో రసస్ఫోరకం. మీ ప్రతీ అడుగు ఆచరణదాయకం. కాంతికంటే వేగంగా కాలం పరుగులిడుతోందా! అన్న భావనలో పిడకలు సిద్ధం చేసుకుంటున్నామా? అన్న సందేహంలో మీ ఆశీస్సులే మాకున్న ఊతం, హితం. దీవించండి దేవా!

కంచి పరమాచార్యుల జీవిత ప్రస్థానం సద్దర్శనం చేస్తే కనిపించే ప్రతీకోణం జనోద్ధరణం. మనిషిని మాధవునిగా తీర్చిదిద్దే శీల నిర్మాణం. దానికి వారు ఎంచుకున్న మార్గం స్వధర్మాచరణం. ఎప్పుడూ వినే మాట కదా! అవును వినే మాటే కానీ, కనే (చూసే) మాట కాదు! అందుకే ఈ రోజు భరతవర్షంలో ఊహించలేని నైర్మల్యాలు కనిపిస్తున్నాయి. పరమాచార్యులు మాటల వేదాంతి కాదు – చేతల వేదాంతి. జీవిత పర్యంతం ఉదయభానుని నులివెచ్చని కిరణాలు భూమిని తాకే ముందే వారి సంధ్యానుష్ఠానాలు పూర్తి అయ్యేవి. దానికి కాలము, శీతోష్ణము, ప్రాంతము, పరిస్థితులు. చివరకు వారి ఆరోగ్యము ఇత్యాదులేవీ నిరోధాలు కాలేకపోయాయి. భక్తజన దుఃఖనివృత్తి, ముముక్ష జీవుల సందేహ నివృత్తిలో రాత్రి 12 గంటల తర్వాత విశ్రమించినా సరే, మూడు గంటలకల్లా మేల్కొని, తమ నిత్యపూజను పూర్తిచేసుకొని, బిడ్డలైన శిష్యులను తాము మేల్కొలిపేవారు. పీఠ సరంజామా సర్దుకొని, బయలుదేరేలోపే రెండు మైళ్ళు పాదచారియై నడిచి వెళ్ళిపోయేవారు. సన్యాసాశ్రమ తొలి నాళ్ళలోనే వారు అన్నిరకాల వాహనాలను త్యజించారు. తాము ఎప్పుడు ఎక్కడికి ప్రయాణించాలన్నా అది కాలినడకను లేదా శిష్యగణం తీసుకువెళ్ళే పల్లకీలో! మోటారు వాహనాలను కానీ, ఏనుగువంటి జంతు రవాణాను కానీ తమ జీవిత పర్యంతం వాడలేదు. భూమిపై చరించే





సమయానికే ఆ చిన్నారి "సాయిబాబా" అని పిలవడం-సరి! నాకు తెలిసిన రీతిలో స్వామి పట్ల నా ప్రేమను వ్యక్తం చేసుకున్నా! గంట గడిచింది. నాకు ఉన్న ఆలోచన-మఠం వారు వెళ్ళిపొమ్మని చెప్పేవరకు ఆ సన్నిధానంలోనే ఉండిపోవాలని. కానీ ఒక గంట అయ్యాక, ఎందుకో అక్కడి నుండి వెళ్ళిపోవాలని బాగా బలంగా అన్పించింది. ఒక పదినిమిషాలు బలవంతంగా అక్కడే కూర్చొన్నాను. ఇక నా వల్ల కాలేదు. మహాత్ముల సన్నిధానాలు ఎంతో శక్తివంతమైనవి కనుక స్వామికి నమస్సులర్పించి తుంగకు ఇవతలి వైపు వచ్చాను. తీరా చూస్తే ఇటువైపు ఉన్న పరమగురువుల సన్నిధానాల్లో ఆరతి కార్యక్రమం జరుగుతోంది. ఓహో! ఇందుకా నన్ను అక్కడి నుండి వెళ్ళగొట్టి ఆరతి, ప్రసాదం ఇప్పించారు అని అర్థమైంది. **బిడ్డల తప్పటడుగులు తలపులతోనే సరిద్దిగలవు- మహాత్ముల ఆశీస్సులు. బాబా దర్శనం చేసుకోకుండా మా గురుదేవుల సన్నిధికి వచ్చే బిడ్డల ముఖం చూసే చెప్పేసేవారు- బాబాను దర్శించుకురమ్మని. అలా శృంగేరీలో మొదలు నన్ను శారదాంబ దర్శనం చేయించి, శ్రీచంద్రశేఖర భారతీస్వామివారి ఆశీస్సులు, వారి పరమగురువుల ఆశీస్సులు నాకు ఇప్పించారు పూజ్య గురుదేవులు. ఇలా సద్గురుదేవులు శ్రీబాబూజీ చెంతన ప్రతీ క్షణమూ ఆనందమే! ప్రతి తలపు ఆహ్లాదమే! ప్రతి అడుగు వారి లీలా విలాసమే!** **-సాయి శ్రీనివాస్**

## దయామృత ధార

దయాహృదయం సెలయేరు వంటిది. అది చిన్నదే కావచ్చు. గలగల పారుతూ వెళ్లి నదిలో కలుస్తుంది. నది సముద్రంలోకి ప్రవహిస్తుంది. అలా ఆ చిన్న సెలయేరు తుదకు సముద్రం అవుతుంది. దయలేని గుండె నీటిగుంట లాంటిది. అందులోని నీరు అక్కడే మురిగిపోయి, దుర్గంధం వెదజల్లుతుంది. ఎంచి చూస్తే లోకంలో రెండే కులాలు. ఒకటి 'మంచి', రెండోది 'చెడు'. ఇతరత్రా ఎన్ని గొప్ప గుణాలున్నా, దయ లేకపోతే మనిషి జీవితం గుండుసున్నా! మన పురాణేతిహాసాల నిండా దయాసముద్రుల గాథలే కనిపిస్తాయి. శ్రీరామచంద్రుడి అపార దయామృతధార స్పర్శవల్ల అహల్యకు శాప విమోచనమైంది.

అమెరికాలో వివేకానందస్వామి పర్యటిస్తున్నప్పుడు, ఒకరోజు అనుకోని సంఘటన ఎదురైంది. మెంఫిస్ వేదాంత కేంద్రంలో ఆయన భగవద్గీత గురించి ప్రసంగించారు. "మనిషి...ఎంత కాదనుకున్నా,



మనసు చెడు మార్గంలోకి లాక్కుపోతూనే ఉంటుంది. అందువల్ల నిత్య జాగరూకతతో ప్రవర్తించాలి" అని ఆయన ప్రసంగం ముగించారు. శ్రోతల హృదయాలు ఉప్పొంగిపోయాయి. వివేకానందుడి స్ఫురద్రూపం, కంచుకంఠం ఒక యువతిని అమితంగా ఆకర్షించాయి. ప్రసంగం పూర్తి అయిన తరువాత ఆయన నడుచుకుంటూ తన బసకు వెళుతుండగా, ఆమె హఠాత్తుగా కౌగలించుకుంది.

ఆయన చలించలేదు. ఆమె శిరస్సు దయతో స్పృశిస్తూ ఇలా అన్నారు. "నాకు అమెరికా దేశంలో ఇలాంటి మాతృస్పర్శ కలిగించావు. నేను ధన్యుణ్ణయ్యాను. నిన్ను చూస్తే, మా శారదామాత గుర్తుకు వస్తోంది. తానే దయతో ఇక్కడ ప్రత్యక్షమై నన్ను గుండెలకు హత్తుకుందని భావిస్తున్నాను".

వివేకానందుడికి శారదామాత గుర్తుకు రాగానే కన్నీరు ప్రవహించి ఆ యువతి శిరస్సు తడిసిపోయింది. ఆమె మనసులోని కాలుష్యాన్ని ఆ కన్నీరు కడిగేసింది. స్వామి పాదాలమీద వాలింది. "మహాత్మా! మీవంటి నిష్కల్మష దయామృతమూర్తిని ఇంతవరకు చూడలేదు. నీచ భావనతో మీ దరి చేరిన నన్ను దయామృత భాష్పజలాలతో ప్రక్షాళన చేసారు" అంది. దయ ఉదయభానుడి లేత కిరణాల వంటిది. అవి ప్రసరించిన ప్రాంతమంతా ప్రభావితం అవుతుంది.

రాయి ఓ పువ్వును చూసి దురహంకారంతో 'నా సంగతి నీకు సరిగ్గా తెలియదు. నాకు కోపం వస్తే నిన్ను సర్వనాశనం చేస్తాను' అని బెదిరించింది. పువ్వు నవ్వుతూ "మిత్రమా! నలిపితే, నా సుగంధం అంతటా వ్యాపించి, అందరూ నన్ను మరింత ప్రశంసిస్తారు. అందుకు కృతజ్ఞత చెప్పాలి నేను" అంది. దయగలవారికి భయం ఉండదు. వారి మనసు పువ్వుతో సమానం. అవసరమైనప్పుడు ఆ మనసు వజ్రసమానంగా మారుతుంది. కరుణాపయోనిధి అయిన శ్రీరాముడు విభీషణుడ్ని ఆదరించాడు. రావణాసురుణ్ని వధించాడు. దయాప్రవాహానికి హద్దులు ఉండవు. పేదలే వారి స్మృతిపథంలో సదా మెదులుతూ ఉంటారు.

ఒక యువకుడు కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడు 'నేను దేశం కోసమే జీవిస్తా, దేశం కోసమే మరణిస్తా' అని ప్రతిజ్ఞ చేసాడు. అప్పటికి భారతదేశం తెల్లవారి పాలనలో ఉన్నది. ఆయన ఐరోపాలో పర్యటించాడు. సత్యాగ్రహంపై పరిశోధన పత్రం సమర్పించి, డాక్టరేట్ పట్టా పొందాడు. భారతదేశానికి తిరిగి వచ్చి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నాడు. జైలుశిక్ష అనుభవించాడు. త్యాగధనుడైన స్వాతంత్ర్య





# గురుకృపాలహరి

**దుర్లభో విషయత్యాగో దుర్లభం తత్త్వదర్శనమ్!**
**దుర్లభో సహజావస్థా సద్గురోః కరుణాం వినా॥**

గురుకరుణ లేనిచో విషయత్యాగం, తత్త్వదర్శనం, సహజావస్థ – అన్నీ దుర్లభమే! సద్గురు కరుణ – తల్లిదండ్రులు రూపాన్నిస్తే, మనిషిని రూపాతీతునిగా తీర్చగలిగిన లీలా విశేషం సద్గురు కరుణ. చూసే ప్రతీ చూపును, చేసే ప్రతీ చేతను భగవన్మయంగా, దైవకార్యంగా మార్చగల మహత్తర శక్తి సద్గురు కరుణ. పతితాధములను కూడా తన పదాల వద్దకు చేర్చుకొని పరుసవేదిగా మార్చగల పరమ వాత్సల్యం – సద్గురు కరుణ.

చారిత్రక సత్యాలు, మహాత్ముల మాటలు, పెద్దల సూక్తులు వింటూ, విశ్లేషిస్తూ, నిత్య జీవితంలో గమనిస్తూ ఉంటే జీవనవిధానం బోధపడుతుంది. సద్గురువంటే అమ్మప్రేమ, అను'రాగం', అనునయించే 'రాగం'. తొలిపొద్దు నుంచి మలిసంధ్య వరకు (పుట్టుక నుండి గమ్యం చేరేవరకు) ప్రతీ అడుగులోనూ సాగే నేపథ్య సంగీతం. ఆ అమ్మఒడిలో ఉన్నానన్న నిశ్చింతలో ఉన్న బిడ్డకు ఆ నేపథ్య సంగీతం లాలిపాటగా ఎప్పుడూ వినిపిస్తూనే ఉంది. అహం వాకిట్ల అలజడిలో మునిగిన చిన్నారుల చిటపటలు కన్పిస్తూనే ఉన్నాయి. అమ్మ లాలిపాటలో లాలిత్యాన్ని ఆస్వాదిస్తూ ఉంటే చాలు. మెల్లగా తాను మనకు ఏర్పాటు చేసిన ప్రణాళికా తోటలో స్వేచ్ఛగా విహరించగలుగుతాం. అడుగులు వేయిస్తూనే అక్షరాలు దిద్దిస్తుంది అమ్మ. ఆ చేయి పట్టుకు నడిస్తే ఆనంద శిఖరాలను చేరుస్తుంది అమ్మ. సద్గురువనే ద్వారం దగ్గర ఎదురుచూసే అమ్మ. మా అమ్మ పేరు సద్గురువు – మా అమ్మ పేరు శ్రీబాబూజీ. పూజ్య చంద్రశేఖరుల చరిత్రను గురుకృపతో పంచుకోవడం గురుదేవుల వాత్సల్యమే. ఇప్పటివరకు వచ్చిన శీర్షికను సింహావలోకనం చేసుకుంటే ఏదో ఒక తెలియని వెలితి – ఒక శేషప్రశ్న – గురువుగారి సంకల్పం లేకుండా శీర్షిక రాదుకదా!


మన (స్వ)భావాలను పొరపాటున గురుబంధువులపై రుద్దుతున్నామా? అని. ఇదిగో నా సందిగ్ధానికి ఆ కరుణామూర్తి శ్రీబాబూజీ సమాధానం – ***"వేదాంత శాస్త్రాలలో అవాఙ్మానస గోచరము, అతీతము అని వర్ణింపబడ్డ భగవతత్త్వము మానవునికి అందని మ్రాని పండేమీ కాదని నిరూపించి సాక్ష్యమిచ్చే మహిత సాధనాలు మహాత్ముల చరిత్రలు. అవి ఆధ్యాత్మిక జీవితానికి జీవగఱ్ఱలు, మహత్తర ఆధ్యాత్మిక గమ్యానికి మార్గం చూపే వెలుగుదివ్వెలు. భక్తి, జ్ఞాన వైరాగ్యాలకు సజీవరూపాలు. కార్యసాధనలో***



15 లక్షల మంది అసువులు బాసారు. ఇంకా మిగిలిన ఒక్క కర్ణుడిని ఏం చేయలేక పోతున్నావు. దీనికి మళ్ళీ నీకు వెనకాల ఆ గాండీవం ఒకటి, షోకుకి. ఏ కాలవలోనో పడేయ్. ఎందుకా చెక్కముక్క?" అన్నాడు. అంతే, అంతవరకు ఓపిగ్గా భరించిన అర్జునుడు ఒక్కసారి ఒరలోంచి కత్తిని తీసాడు. "నన్నన్నా పర్లా, నా గాండీవాన్ని ఎగతాళి చేసావు. చంపేస్తా" అన్నాడు. కృష్ణుడు వారించాడు. "ఎవరినైనా చంపే అర్హత నీకుంది. కానీ ముందు అతను చేసిన తప్పులు చెప్పు" అన్నాడు. అంతే, తన అన్న ధర్మరాజుని శతవిధాలా నిందించాడు. ఆడిపోసాడు అర్జునుడు. ఇంక చాల్లే వెళ్దాం అన్నాడు కృష్ణుడు. మరి నా శపధమో అన్నాడు పార్థుడు. "తల్లిని, తండ్రిని, గురువుని, అన్నని, రాజుని, యజమానిని చంపాలంటే కత్తితో పొడిచి చంపక్కర్లా. వారి గురించి చెడుగా మాట్లాడితే వారిని హత్య చేసినట్లే. నువ్వు నీ అన్నని వందసార్లు హత్యచేసావు. నీ ప్రతిజ్ఞ తీరినట్లేగా" అన్నాడు. సిగ్గుతో తలవంచుకున్న అర్జునుడు మళ్ళీ కత్తి తీసాడు. ఈసారి ఏమైంది అన్నాడు కృష్ణుడు. "మా అన్న దైవసమానుడు. తండ్రి తరువాత అతనే మమ్మల్ని కొడుకులుగా భావించాడు. అంతటి వానిని నిందించాను. చాలా పాపం. ఇక ఆత్మహత్య చేసుకొని చచ్చిపోతా" అన్నాడు. కత్తి దూసాడు. "ముందు కత్తి లోపల పెట్టేయ్" అన్నాడు గోపాలుడు. "ఎవరికైనా ఆత్మహత్య చేసుకోవడానికి అర్హత ఉంది. నీ జీవితం, నీ ఇష్టం. కానీ ప్రతి మనిషి కొన్ని కార్యాల నిమిత్తమై జన్మింపబడతాడు. నీవు చేసిన గొప్ప పనులేంటి? ఏం ఘనకార్యాలు చేసావు? ఏం సాధించావు? ముందది చెప్పు" అని అన్నాడు వాసుదేవుడు. అంత అర్జునుడు "పరమశివుడు కౌగిలించుకొని 'విజయుడు' అనే బిరుదు ఇచ్చాడు. పాశుపతాస్త్రం సాధించా, దేవతలను ఓడించా, ఇంద్రలోకంలో సన్మానం జరిగింది. కోరి వలచిన ఊర్వశిని తల్లిలా సేవించా, నపుంశకునిలా బ్రతుకుతావని శపించినా, క్షమించా. అంటూ వంద విషయాలు ఏకరువు పెట్టాడు పార్థుడు. 'ఇంక చాల్లే వెళ్దాం' అన్నాడు కృష్ణుడు. 'మరి నా ప్రతిజ్ఞో'? అన్నాడు సవ్యసాచి. అంత శ్రీకృష్ణుడు 'ఎవరైనా తనని తాను పొగుడుకుంటే అది ఆత్మహత్యతో సమానం. నిన్ను నీవు తెగ పొగిడేసుకొని ఇప్పటికి వందసార్లు ఆత్మహత్య చేసుకున్నావు. ప్రతిజ్ఞ నెరవేరినట్టేగా పార్థా! అన్నాడు జగన్నాటక సూత్రధారి శ్రీకృష్ణుడు. **పరనింద బ్రహ్మహత్య, సొంతడబ్బా ఆత్మహత్య!**

**–మురళీయం**





సమరయోధుడిగా గుర్తింపు పొందాడు. స్వాతంత్ర్యానంతరం ప్రజాసంక్షేమం కోసం అనేక సంస్థలు స్థాపించి కృషి చేసాడు. అనంతరం వ్యాధిగ్రస్తుడై, ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆయనకు శస్త్రచికిత్స అవసరమైంది. పలువురు వైద్యులు అక్కడికి చికిత్స చేయడానికి వెళ్లారు. అప్పుడు ఆ మహనీయుడు 'కోట్లాది ప్రజలు ఈ దేశంలో ఏ వైద్య సదుపాయమూ లేక అల్లాడుతున్నారు. నన్ను ఒక్కణ్ణీ రక్షించడానికి ఇక్కడ ఇంతమంది వైద్యులు ఎందుకున్నారు?' అని ప్రశ్నించాడు. అలా అంటూనే కన్నుమూసిన ఆ మహనీయుడి పేరు **– రామ్ మనోహర్ లోహియా!**

**– డాక్టర్ పులిచెర్ల సాంబశివరావు**

## యధోక్తకారి

రాజుకు కోపం వచ్చింది. స్వాభావికంగానే అతనిది రాజరిక ప్రవృత్తి. "నిన్ను నా రాజ్యం నుంచి బహిష్కారం చేసాను. ఈ రాజ్యం వదలి వెళ్ళు" అని దండన విధించాడు. 'నీవు నన్ను బహిష్కారం చేసేదేమిటి? నీ బోటి రాజు యొక్క రాజ్యంలో ఉండటమే పాపం. నేనే నీ రాజ్యం నుంచి వెళ్ళిపోతాను" అని కానికణ్ణర్ కంచి వదలి వెళ్ళిపోయాడు. నగరం వదిలిపోయే ముందు అతడు తన గురువును దర్శించి జరిగినది చెప్పాడు. తిరుమళిని ఆళ్వారు పరమభక్తుడు, పరమయోగి, అన్నిటిలోనూ ఆయనకు విరక్తే. ఒక్క రెండు విషయాలలో తప్ప. అతడు తన భుజంగశయన పెరుమాళ్ళను వదిలి ఉండలేడు. రెండవది ఈ శిష్యుడు కానికణ్ణర్‌ను వదులుకోలేదు.

శిష్యుడు వెళ్ళేసరికి గురువూ అతనిని అనుగమించాడు. శిష్యుడు గురువును తన వెంట రమ్మని ప్రార్థించలేదు. గురువే శిష్యుని వెంట పడుతున్నాడు. ఆయన వాత్సల్యం అలాంటిది. తాను ఎట్లా తన శిష్యుణ్ణి అనుగమిస్తున్నాడో తన భగవంతుడైన భుజంగశయనుడూ తన్ను అనుసరించి వస్తాడని ఆయన అనుకున్నాడు. కానీ భుజంగశయనుడు నిశ్చింతగా తన శేషపర్వతంపై పడుకొని ఉన్నాడు. ఆళ్వార్ అన్నాడు "చూడు నా బిడ్డ ఏమో రాజ్యం వదిలిపోతుంటే నీవేమో చీమ కుట్టినట్లు కూడా లేకుండా పడుకొని ఉన్నావు. వెంటనే నీ చాప చుట్టు. నేనేమో వాడిని వదిలి ఉండలేను. నీవు ఈ విధంగా పడుకొని ఉంటే ఏమిటి అర్థం? గబగబా లేచిరా" అని.


ఇక లాభం లేదని భుజంగశయనుడు ఆళ్వారును అనుగమించాడు. ఆళ్వారు కానికణ్ణర్‌ను అనుసరించాడు. వాళ్ళు ఈ విధంగా 5 మైళ్ళ దూరం నడిచారు. ఇంతలో చీకటి పడింది.



పెరుమాళ్ళు అన్నాడు – "ఈ చీకట్లో నాకు దారి కనిపించడం లేదు. ఈ రాత్రికి ఇక్కడే విశ్రమిద్దాం. తెల్లవారగానే మనం మళ్ళా ప్రయాణం చేద్దాం". భగవంతుడు యథోక్తకారి కదా! చెప్పింది చేయకుండా భక్తునికి ఈ సలహా ఇవ్వడమెందుకు? ఇదీ ఒక లీలే. పాలార్ తీరంలో చల్లగా గాలి వీస్తుంటే ఈ ముగ్గురూ ఆకాశమే పందిరిగా సుఖంగా నిద్రించారు.

కంచిలో పెరుమాళ్ళు వీపు తిప్పాడో లేదో అలక్ష్మి నగరమంతా ఆక్రమించింది. విష్ణువు వక్షస్థలంలో లక్ష్మి–మబ్బు వెనుక మెరుపువలే ఉంటుంది. విష్ణువు ఎప్పుడు కంచి వదిలి వెళ్ళాడో, ఆయన వక్షస్థలవాసి కనుక ఆయన వెంట వెళ్ళింది. కంచిలో అలక్ష్మి తాండవించింది. అంతా చీకటి. దీపమన్న మాటలేదు. ఆలయాలలో పూజలన్నీ నిలిచిపోయాయి. అంతా తమసావృతమైంది. సంతోషమన్న మాటలేదు. ఎవరి ముఖం చూసినా విషాదం పులుముకొని ఉన్నది.

ప్రజలందరూ రాజు వద్దకు వెళ్ళి మొరపెట్టుకున్నారు. అతనికీ ఆశ్చర్యమే, ఆదుర్దానే. విష్ణువు ఊరు విడిచి వెళ్ళినందున ఈ ముప్పు వచ్చిందని గ్రహించాడు. భగవంతుని పాదాల మీద పడి తన తప్పు క్షమించి రక్షించవలసిందని ప్రార్థించడానికి అతడూ నగరం వదిలి బయలుదేరాడు. ఉదయ మయ్యేసరికి వారు ముగ్గురూ ఉన్న చోటికి చేరుకున్నాడు. అతని ప్రార్థన విన్న భగవంతుడు ఇలా అన్నాడు "చూడూ! నేను నా అంతట నగరం వదిలి రాలేదు. ఈ ఆళ్వారు నన్ను రమ్మన్నాడు. నేను ఆయన మాట త్రోసివేయలేక వచ్చాను. ఆ ఆళ్వారు నాకు చెబితే కానీ నేను నగరంలో అడుగుపెట్టను. అందుచేత నీవు ఆ ఆళ్వార్‌నే అడుగు". రాజు ఆళ్వార్ వంకకు తిరిగాడు. ఆళ్వారు అన్నాడు "నేను నా అంతట నగరం వదిలి రాలేదు. నా శిష్యుణ్ణి వదిలి నేను ఉండలేను. నన్ను విడిచి ఉండలేక పెరుమాళ్ళు నా వెంట వచ్చాడు. నేను వస్తే కానీ పెరుమాళ్ళు కంచి రాడు. నా శిష్యుడు వస్తే కానీ నేను కంచి రాలేను. నీవేమో నా శిష్యుణ్ణి బహిష్కరించావు. పోయి అతని పాదాలపై పడి వేడుకో. అతడు మళ్ళా కంచి వస్తే మేమూ అతని వెంట వస్తాం." రాజు కోరికను మన్నించి కానికణ్ణర్ కంచి తిరిగి వచ్చాడు. అతనితోపాటు ఆళ్వారు, ఆళ్వారును అనుసరించి పెరుమాళ్ళు, యథాప్రకారం కంచిలో మళ్ళా స్థిరపడ్డారు. కంచికి ఐదు మైళ్ళ దూరంలో వీరు ముగ్గురూ ఒక రాత్రి గడిపినారు. ఆ చోటు పేరు 'ఓరిదవిరుక్కై' – ఒకనాటి రాత్రి ఉండుట. కాలక్రమేణా ఆ పదం 'ఒరిక్కై' అయింది.



కంచికి వచ్చిన పెరుమాళ్ళు ఆదిశేషుణ్ణి పడుకోమని చెప్పి తానూ అనంతశయనమూర్తిగా పవ్వళించవచ్చును కదా! లేదు! ఆళ్వారు ఆజ్ఞ కోసం కాచుకొని నిలుచున్నాడు. ఆయన యథోక్తకారి కదా! అంత వినయంగా నిలుచున్న ఆ పరమపదనాథుని చూసి ఆళ్వారుకు ప్రేమ పొంగిపోయింది. "నేను వచ్చాను, నా శిష్యుడూ వచ్చాడు. అతనిని పిలుచుకొని రావడానికి నిన్ను చాప చుట్టమన్నాను. ఇప్పుడెందుకు వ్యర్థంగా నిలుచున్నావు? చాప పరచుకొని సుఖంగా పవళించు". అని భక్తుడు అనుమతించగానే భగవంతుడు భుజంగశయనుడయ్యాడు.

దీని తాత్పర్యం ఏమంటే **"గురుభక్తి ఉన్నవారిని గురువే కాదు, ఈశ్వరుడు కూడా అతనిని అనుసరిస్తాడని. అందుచేతనే కొందరంటారు నాకు నా గురువనుగ్రహం ఉంటే చాలు. ఈశ్వరానుగ్రహం తానుగా వస్తుంది"** అని.

**– కంచి పరమాచార్య వైభవం**

## పరనింద హత్య - సొంతడబ్బా ఆత్మహత్య

భారతయుద్ధం పదిహేనో రోజు. అప్పటికే 15 లక్షల మంది యమ ధర్మరాజు కొలువులో చేరారు. యోధులు చాలామంది క్షతగాత్రులయ్యారు లేదా అలసిసొలసి, సొమ్మసిల్లి పడిపోయారు, గాయాలపాలై మూలుగుతున్నారు. ఆ రోజు ధర్మరాజు, ఇంకా చాలామంది యుద్ధానికి వెళ్లలేక పోయారు. గాయాలని లెక్కచేయకుండా అర్జునుడు మాత్రం ఓ రెండు మూడు గంటలైనా యుద్ధం చేసొద్దామని ఉపక్రమించాడు. ఆ రోజు కర్ణుడు కౌరవసేనాధిపతి. కసితో యుద్ధం చేసాడు. భీష్ముడు తనను అర్ధరథుడుగా వర్ణించినందుకు నిరసనగా మొదటి 10 రోజులు అంటే భీష్ముడున్నంత కాలం ఆయుధం పట్టలేదు. ఆ బాధంతా ఈ విధంగా వెళ్లకక్కాడు. కొంత సేపయ్యాక యుద్ధం చేసి అలసిన అర్జునుడు విశ్రాంతి కోరాడు. రథసారథి అయిన శ్రీకృష్ణుడు రథాన్ని బైటకి మళ్ళించి దగ్గరలోనే ఉన్న ధర్మరాజు శిబిరానికి తీసికెళ్ళాడు. కృష్ణార్జునులను చూడగానే యుధిష్టరుడు ఆనందంతో వచ్చి తమ్ముణ్ణి కౌగిలించుకొని "అర్జునా, నాకు తెలుసు. యుద్ధం మధ్యలో వచ్చావంటే కర్ణుడిని హతమార్చుంటావు. ఆ వార్త చెప్పడానికే వచ్చావు.... ఇంకేంటి, యుద్ధం పరిసమాప్తమయినట్టే" అన్నాడు. అంతలోనే విషయం తెలుసుకొని, అతన్ని వదిలించుకుని "ఛీ! నీ అంత ప్రగల్భాలు పలికే వాడింకెక్కడా అగుపడడు. ఒక్కరోజులో యుద్ధం ముగించేస్తా" అన్నావు. 15 రోజులై పోయాయి.